


## మూగ జీవాల అరణ్య రోదన ?

PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd




## ఆకుల రాలే కాలం ఇది

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 01 సంచిక - 91 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 06 రూ - 03/- శనివారం 30 మార్చి 2024

## 31న జనగామ, ఉమ్మడి నల్గొండ జిల్లాల్లో కెసిఆర్ పర్యటన...



**హైదరాబాద్,మార్చి 29(పిసిడబ్ల్యూ న్యూస్):** నీళ్లందక ఎండిపోతున్న పంటపొలాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, కరువుకు అల్లాడుతున్న రైతాంగానికి ధైర్యాన్ని నింపేందుకు, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ జిల్లాల పర్యటన చేపట్టనున్నారు. ఇందులో భాగంగా ఈనెల 31న జనగామ, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో కెసిఆర్ పర్యటించనున్నారు.

## లోక్‌సభ ఎన్నికల వేళ

# కాంగ్రెస్‌కు షాక్

- కాంగ్రెస్ పార్టీకి మరోసారి ఐటీ నోటీసులు
- 1,700 కోట్ల చెల్లించాలంటూ నోటీసు
- దేశవ్యాప్త ఆందోళనలకు కాంగ్రెస్ పిలుపు
- ముమ్మాటికీ అప్రజాస్వామిక చర్యే
- కాంగ్రెస్ అడ్వకేట్, ఎంపీ వివేక్ తంఖా

మిగతా 2లో.



**న్యూఢిల్లీ,మార్చి 29(పిసిడబ్ల్యూ న్యూస్):** లోక్‌సభ ఎన్నికల వేళ ఐటీ వ్యవహారం కాంగ్రెస్ పార్టీకి మింగుడుపడటం లేదు. ఈ అంశంలో ఆ పార్టీకి వరుసగా ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. తాజాగా ఆ పార్టీకి ఐటీ శాఖ మరోసారి నోటీసులు ఇచ్చింది. నోటీసుల విషయాన్ని కాంగ్రెస్ అడ్వకేట్, ఎంపీ వివేక్ తంఖా శుక్రవారం తెలిపారు. తమపై ఐటీ శాఖ ప్రక్రియను నిలిపివేయాలంటూ కాంగ్రెస్ పార్టీ వేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టేసింది. వెంటనే ఆ పార్టీకి నోటీసులు ఇచ్చింది ఐటీ శాఖ. 2017-18 నుంచి 2020-21 వరకు సంబంధించిన పెనాల్టీ, వడ్డీ కలిసి 1700 కోట్ల రూపాయలను తేల్చింది. దీనిపై కాంగ్రెస్ మండిపడింది. నేరుగా నోటీసులు ఇవ్వడంపై ఎంపీ వివేక్ తంఖా మండిపడ్డారు. ఇది ముమ్మాటికీ అప్రజాస్వామిక చర్యగా వర్ణించారు. ఎన్నికల వేళ ప్రతిపక్ష పార్టీని ఆర్థికంగా ఇబ్బందులు గురిచేయడానికి మోదీ సర్కార్ ప్లాన్ చేసినట్టు దుయ్యబట్టారు. దీనిపై చట్టపరంగా ఫైట్ చేస్తామన్నారు. ఆదాయపు పన్ను శాఖ చేపట్టిన ప్రక్రియను నిలిపివేయాలంటూ కాంగ్రెస్ పార్టీ గురువారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. మదింపు ప్రక్రియ చేపట్టేందుకు అవసరమైన ఆధారాలు ఐటీ అధికారుల వద్ద ఉన్నాయని, ఈ విషయంలో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. గతంలోనూ 2014 నుంచి 2017 వరకు సంబంధించిన ఐటీ వ్యవహారాలపై న్యాయస్థానం తిరస్కరించింది. ఇప్పటికే కాంగ్రెస్ బ్యాంకు ఖాతాల నుంచి దాదాపు 135 కోట్ల రూపాయలను రికవరీ చేసుకుంది ఐటీ విభాగం. ఐటీ శాఖ నోటీసులపై కాంగ్రెస్ మండిపడుతోంది. సార్వత్రిక ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీని

## పదేళ్లు పదవులు అనుభవించి దగా

### - కెకె, కడియంలపై కెటిఆర్ విమర్శలు



**హైదరాబాద్,మార్చి 29(పిసిడబ్ల్యూ న్యూస్):** గత పదేండ్లుగా పార్టీలో అనేక పదవులు అనుభవించిన కే కేశవరావు, కడియం శ్రీహరి ఇవాళ పార్టీ నుంచి జారుకున్నారని వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం విస్తృత స్థాయి సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. కష్టకాలంలో బీఆర్ఎస్ పార్టీకి అండగా ఉంటానని చెప్పి ఇవాళ కాసాని జ్ఞానేశ్వర్ ముందుకు వచ్చారు. అవకాశం ఇస్తే చేవెళ్లలో నేను నిలబడుతానని చెప్పారు. దీంతో కేసీఆర్ ఆయనకు అవకాశం కల్పించారు. కాసాని ధీరోదాత్తమైన నాయకుడు. బలహీన వర్గాల ముద్దుబిడ్డ, బడుగుల ఆశాజ్యోతి అని చాలా మంది అనేక ప్రసంగాలు ఇచ్చారు. అలా బీసీ జాతి కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్. ఒక్క రంగారెడ్డి జిల్లాకే కాదు..

వివరాలు 2లో

## రైతుబంధు ఇవ్వలేదని ప్రచారం.. భట్టి కౌంటర్ ఇదే..!



**హైదరాబాద్,మార్చి 29(పిసిడబ్ల్యూ న్యూస్):** రైతుబంధుపై ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారంపై డిప్యూటీ సీఎం భట్టి కౌంటర్ ఇచ్చారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడారు. 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడకానికి జీరో బిల్లు అమలు చేశామన్నారు. గత ప్రభుత్వం వదిలేసిన డ్వాక్రా సంఘాలపై కాంగ్రెస్ దృష్టి పెట్టిందన్నారు. డ్వాక్రా సంఘాలకు రూ.లక్ష కోట్ల మేర వడ్డీ లేని రుణాలు ఇచ్చే కార్యక్రమాలు చేపడతామన్నారు. వంద రోజుల్లో 30 వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం టీఎస్ పీఎస్సీని ప్రక్షాళన చేపట్టామన్నారు. ఏప్రిల్ 6న తుక్కుగూడలో కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రకటిస్తామన్నారు.దేశం ఆశ్చర్య పోయేలా సభను విజయవంతం చేయాలన్నారు. తుక్కుగూడ సభకు శ్రేణులు కదిలిరావడంపై సన్నద్ధం కావాలన్నారు. ప్రజల్లో ఉన్న స్పందనను ప్రచారంలో వాడుకోవాలన్నారు. రైతుబంధు ఇవ్వలేదని ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని.. 64.75లక్షల మందికి రూ.5,500 కోట్లు రైతు బంధు నిధులు జమ చేశామన్నారు. ఐదెకరాల వరకు ఇప్పటివరకు రైతుబంధు నిధులు జమ చేశామన్నారు. మిగతా 5 లక్షల మంది రైతులకు రైతుబంధు నిధుల పంపిణీకి చర్యలు తీసుకుంటామన్నారు. కాంగ్రెస్ వచ్చాక ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నామన్నారు. మూసీ అభివృద్ధి, ట్రిపుల్‌ఆర్‌పై కేంద్రం నుంచి నిధులు తెచ్చే పనులు చేపట్టామన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డివి ఊసరవెల్లి మాటలు: ఈటెల



**హైదరాబాద్,మార్చి 29(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఊసరవెల్లి మాటాలు మాట్లాడుతున్నారని, మొదటిసారి వచ్చినప్పుడు ప్రధాని మోడీని మాపెద్దన్న అని ప్రస్తుతం మోడీ గిడి అంటూ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మల్కాజిగిరి ఎంపి అభ్యర్థి ఈటల రాజేందర్ దుయ్యబట్టారు. శుక్రవారం మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గం బిజెపి కార్యకర్తలు సమావేశంలో మాట్లాడుతూ సిఎం రేవంత్ నువ్వు చిన్న మనిషివి, అధికారం మీ అమ్మ నాన్న ఇచ్చింది కాదని, బిఆర్ఎస్ నేత కెసిఆర్‌ను ఓడగొట్టడానికి ప్రజలు ఇచ్చిందని, ప్రధాని మోడీని విమర్శించిన వారు ఏమైపోయారో చూశామని, నీకు అదే గతిపడుతుందన్నారు. ఇటీవల జరిగిన చిన్న ఎన్నికలు అని కాంగ్రెస్‌కు వేశామని, ఇప్పుడు పెద్ద ఎన్నికలు మోడీకే వేస్తాం అంటున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని, ఓటు ఉందో లేదో యువత చెక్ చేసుకోవాలని,తప్పకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. సుస్థిర, సుసంపన్న, శాంతియుత పాలన కావాలంటే మోడీకి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.వరంగల్ సీటు ఇస్తా అంటే వద్దు అని పారిపోతున్నారని, బిఆర్ఎస్ మొన్నటి వరకు అన్నింటిలో నంబర్ వన్ అని చెప్పుకున్నారని, కానీ ఇప్పుడు పోటీ చేయడానికి నాయకులు దిక్కులేరని ఎద్దేవా చేశారు. ఇటీవల గెలిచిన నాయకులంతా వరుసగా జారిపోతున్నారని, మూడోసారి బిజెపికి అధికారం ఇవ్వాలని కోరారు. తెలంగాణ ఉద్యమ కారులు, నాతో పాటు టిఆర్ఎస్‌లో పనిచేసిన నాయకులు తెలంగాణ అభివృద్ధి కోసం, దేశాభివృద్ధికి బిజెపికి ఓటు వేయాలన్నారు. కాంగ్రెస్ పుట్టిన యూపీలోనే నీకు అడ్రస్ లేక వేరే సీట్లో గెలిచారని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలుచేస్తే దేనికంటే దానికి సిద్ధమని సవాల్ విసిరారు.

వివరాలు 2లో

## ఆదివారం ఢిల్లీ రామ్‌లీలా మైదాన్‌లో మెగా ర్యాలీ




**న్యూఢిల్లీ,మార్చి 29(పిసిడబ్ల్యూ న్యూస్):** ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అర్వింద్ కేజ్రీవాల్‌ను ఇడి అరెస్టు చేసినందుకు నిరసన సూచకంగా రామ్‌లీలా మైదాన్‌లో 'ఇండియా' కూటమి మెగా ర్యాలీ నిర్వహణకుఢిల్లీ పోలీసులు అనుమతిఇచ్చారు. ప్రతిపక్ష కూటమిలో భాగమైన 13 పార్టీలు మెగా ర్యాలీలో పాల్గొంటాయని, కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే హాజరవుతారని కూటమి వర్గాలు వెల్లడించాయి. జైలు నిర్బంధితుడైన ఝార?ండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ భార్య కల్పనా సోరెన్ కూడా ర్యాలీలో ప్రసంగిస్తారని ఆ వర్గాలు తెలిపాయి.ఝార?ండ్ సిఎం పదవికి రాజీనామా చేసిన కొద్దిసేపటికే భూ కుంభకోణం కేసులో హేమంత్ సోరెన్‌ను ఇడి జనవరిలో అరెస్టు చేసింది. ర్యాలీకి హాజరు కానున్న 'ఇండియా' కూటమి ఇతర నేతలలో వెటరన్ రాజకీయ నేత శరద్ పవార్, శివసేన (యుబిటి) చీఫ్ ఉద్ధవ్ థాక్కరే, ఆయన కుమారుడు ఆదిత్య థాక్కరే, సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్, ఝార?ండ్ ముఖ్యమంత్రి చాంపై సోరెన్, టిఎంసి ఎంపి డెరెక్ ఓబ్రియన్, సిపిఐ (ఎం) నేత సీతారామ్ ఏచూరి కూడా ఉన్నారని ఆ వర్గాలు తెలియజేశాయి. 'నియంతృత్వం తొలగాలి, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి' అనే బ్యానర్ కింద ర్యాలీ జరుగుతుంది.

## కాంగ్రెస్‌లో చేరుతున్న కడియం శ్రీహరి

**న్యూఢిల్లీ,మార్చి 29(పిసిడబ్ల్యూ న్యూస్):** బిఆర్ఎస్ నేత, మాజీ ఉపముఖ్య మంత్రి కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీలో చేయబోతున్నారు. కాంగ్రెస్ నేతలు వచ్చి తనను ఆహ్వానించడం సంతోషంగా ఉందని ఆయన అన్నారు. కాగా కోమటి రెడ్డి బిఆర్ఎస్ గేట్లు పగలగొట్టి కాంగ్రెస్ లోకి వస్తున్నారన్నారు. కడియం శ్రీహరి కూతురు కడియం కావ్య కూడా కాంగ్రెస్ లో చేరుతున్నారు. ఆమె నిన్ననే వరంగల్ లోక్‌సభకు బిఆర్ఎస్ నుంచి పోటీచేయబోవడాన్ని విరమించుకున్నారు.కడియం శ్రీహరి ఇటీవల బిఆర్ఎస్ పై వచ్చిన అవినీతి, భూకబ్జాలు, ఫోన్ ట్యాపింగ్, లిక్కర్ స్కామ్ వంటివి పార్టీ ప్రతిష్టను దెబ్బతీశాయన్నారు. కడియం కుటుంబం పార్టీ మార్పు బిఆర్ఎస్ పార్టీకి ఓ ఎదురు దెబ్బగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.



## లోక్‌సభ ఎన్నికల వేళ కాంగ్రెస్‌కు షాక్

(మొదటి పేజీ తరువాయి)

దెబ్బతీసేందుకు బీజేపీ కుట్ర పన్నిందని ఆ పార్టీ నేతలు భగ్గుమంటున్నారు. తమపై ఐటీ చర్యలను నిలిపివేయాలంటూ కాంగ్రెస్ పార్టీ వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసిన వెంటనే.. కాంగ్రెస్‌కు ఐటీ నోటీసులు జారీ చేసింది. 2017-18, 2020-21 మదింపు సంవత్సరాలకు సంబంధించి పెనాల్టీ, వడ్డీ వసూలుకు రూ.1823 కోట్లు చెల్లించాలని నోటీసులు ఇచ్చింది. ఇప్పటికే ఎన్నికల్లో డబ్బు లేదని ఆ పార్టీ నేతలు గగ్గోలు పెడుతున్న సమయంలో మరోసారి ఐటీ నోటీసులు ఇవ్వడంపై సీనియర్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఐటీ శాఖ నోటీసులను నిరసిస్తూ కాంగ్రెస్ హైకమాండ్ నిరసనలకు పిలుపునిచ్చింది. శనివారం దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలు నిరసనలు చేపట్టాలని పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ. వేణుగోపాల్ పిలుపునిచ్చారు. అన్ని రాష్ట్ర విభాగాలను కోరారు. పీసీసీ ప్రధాన కార్యాలయాల దగ్గర, జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యాలయాల దగ్గర ధర్నా చేయాలని అధిష్టానం ఆదేశించింది. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీని ఆర్థికంగా దెబ్బతీసేందుకే కేంద్రం ఇలాపన్నుఉగ్రవాదానికిపాల్పడుతోందనికాంగ్రెస్ మండిపడింది.

## పదేళ్లు పదవులు అనుభవించి దగా

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రం మొత్తానికి ఆయన సుపరిచితుడు. ముదిరాజ్‌లకు ఎంతో సేవ చేశారు అని కేటీఆర్ తెలిపారు. కష్టకాలంలో మన కోసం వచ్చిన కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి. మన కష్టంలో ఉంటే పెద్ద పెద్ద నాయకులు కే కేశవరావు, కడియం శ్రీహరి పార్టీ నుంచి జారుకుంటున్నారు. ఈ సమయంలో ధీరోదాత్తంగా నిలబడి నేనున్నా అంటూ ముందుకు వచ్చిన నాయకుడిని కడుపులో పెట్టుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. చేవెళ్లలో నిలబడ్డది కేసీఆర్.. అనుకొని కొట్లాడుదాం. ఆయన కోసం ఓటేస్తాం అనే కమిట్‌మెంట్‌తో పని చేద్దాం. పదేండ్లు పదవులు అనుభవించిన తర్వాత.. పోయేవాళ్లు రెండు రాళ్లు వేసి పోతారు. అది వారి విజ్ఞతకే వదిలేద్దాం.. కాలమే సమాధానం చెప్తుందని కేటీఆర్ అన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డివి ఊసరవెల్లి మాటలు: ఈటెల


(మొదటి పేజీ తరువాయి)

మల్కాజిగిరి నరేంద్రమోడీ గుండెల్లో పెట్టుకున్న నియోజకవర్గమని, ఈ ప్రజల ప్రేమకు ముగ్ధులు అయ్యారని నాగర్ కర్నూల్, జగిత్యాలలో చెప్పారని, ఈ ప్రేమతో జీవితం ధైన్యం అయ్యిందన్నారు. బిజెపి గెలిచే 400 స్థానాల్లో మల్కాజిగిరి కూడా ఒకటి ఉండబోతుందని, ప్రజల భాగస్వామ్యంతోనే మల్కాజిగిరి మోడీ రోడ్ షో విజయవంతమైందన్నారు. కిలోమీటర్ల మేర రోడ్డుకి ఇరువైపుల నిలబడి స్వాగతం పలికారని, తెలంగాణ గడ్డ మీద ప్రజల సంఘీభావం మోడీ మదిలో చిరస్థాయిగా నిలచిపోయిందని పేర్కొన్నారు. కేవలం నార్త్ ఇండియాలోనే కాదు సౌత్ ఇండియాలో కూడా మోడీ ప్రభంజనం బలంగా ఉంది అని నిరూపించారు. ఈసారి మాకు పార్టీ జెండా సిద్ధాంతం సంబంధంలేదు మావోటు మోడీ, ఈటల రాజేందర్‌కే అని చెబుతున్నారని వెల్లడించారు. ప్రపంచదేశాలు కూడా మళ్ళీ మోడీ ప్రధాని అవుతారని నమ్ముతున్నారని, ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన ప్రధాని మన నరేంద్ర మోడీనేని, ఆయన హయాంలో 12 కోట్ల మరుగుదొడ్డు నిర్మించారని తెలిపారు. బాంబుల మోతలు లేవు తెగిపడ్డ శరీరాలు లేవు. పుల్వామా దాడి చేస్తే సర్జికల్ స్ట్రైక్ చేసి బదులు తీర్చుకున్నారన్నారు. ప్రజలు డబ్బు, మద్యంకు పాతర వేసి, ధర్మాన్ని గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు, ఆర్కే శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ వెంకటేష్, గోలీమధుసుదన్ రెడ్డి, వీకే మహేష్, వేణుగోపాల్ రెడ్డి, ,కార్పొరేట్లు శ్రవణ్, సునీత, టీమ్ సాయి, గిరివర్ధన్ రెడ్డి, శ్రీనివాస్, ప్రసన్న, వాసంశెట్టి శ్రీనివాస్, నరసింహ గౌడ్, వద్ది సుబ్బారావు, ప్రీతం రామకృష్ణ, మడిపడిగే జగదీష్, గణేష్, లక్ష్మణ్ గౌడ్‌లు పాల్గొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలనం

- టెలిగ్రాఫ్ యాక్ట్ కింద కేసును నమోదు
- దేశంలో తొలి కేసుగా గుర్తింపు
- ఇద్దరు అధికారులకు ఐదురోజుల కస్టడీ

**హైదరాబాద్,మార్చి 29(పిసిడబ్ల్యూ న్యూస్):** గత కొన్ని రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా ఫోన్ ట్యాపింగ్ కేసు వ్యవహారం సంచలనంగా మారింది. ఈ ఫోను ట్యాపింగ్ కేసుపై శుక్రవారం అధికారికంగా బంజారా హిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. టెలిగ్రాఫ్ యాక్ట్ కింద కేసును నమోదు చేశారు. దేశంలోనే తొలిసారిగా టెలిగ్రాఫ్ యాక్ట్ కింద కేసు నమోదు అయ్యింది. రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసు.. శుక్రవారం దేశ వ్యాప్తంగా ఒక్కసారిగా వెలుగులోకి వచ్చింది. టెలిగ్రాఫ్ యాక్ట్ కింద నమోదైన తొలి కేసుగా ఈ ఫోన్ ట్యాపింగ్ కేసు గుర్తింపు పొందింది. టెలిగ్రాఫ్ యాక్ట్ కింద బంజారా హిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి నాంపల్లి కోర్టులో మెమో దాఖలు చేశారు. కేసులో ఏ3గా ఉన్న సిటీ టాస్క్ ఫోర్స్ మాజీ డీఎస్పీ రాధాకిషన్ రావును శుక్రవారం నాంపల్లి కోర్టులో పోలీసులు హాజరుపరచగా.. కోర్టు ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. ఏప్రిల్ 11వ తేదీ వరకు రిమాండ్ విధించింది. ప్రస్తుతం అతన్ని పోలీసులు చంచల్ గూడ జైలుకు తరలించనున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసును దర్యాప్తు చేస్తున్న కొద్దీ రోజురోజుకీ కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో ఎవరెవరు భాగస్వాములు అయ్యారనే విషయాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ప్రస్తుతం పోలీసుల కస్టడీలో ఉన్న మాజీ డీఎస్పీ ప్రణీత్ రావు విచారణలో ఒక్కో విషయం వెల్లడిస్తున్నారు.ప్రతిపక్ష నేతలు, ప్రజా సంఘాలు నేతలు, పారిశ్రామిక వేత్తలను టార్గెట్ చేసుకుని ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడినట్లు ప్రణీత్ రావు తెలిపారు. ఈ కేసులో తనతో పాటుగా నాటి ఇంటెలిజన్స్ చీఫ్ ప్రభాకర్ రావు కీలకంగా వ్యవహరించినట్లు వెల్లడించారు. దీంతో పోలీసులు ప్రభాకర్



రావును ఏ1గా గుర్తించి కేసు నమోదు చేశారు. ప్రణీత్(ఏ2), సిటీ టాస్క్ పోర్స్ మాజీ డీఎస్పీ రాధాకిషన్ రావును(ఏ3), భూపాలపల్లి అడిషనల్ ఎస్పీ భుజంగరావును ఏ4గా, తిరుపతన్నను ఏ5గా గుర్తించి పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అయితే ఏ3గా ఉన్న రాధాకిషన్ రావును శుక్రవారం నాంపల్లి కోర్టులో పోలీసులు హాజరుపరచగా.. కోర్టు ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావును అరెస్ట్ చేసిన పోలీసులు, మిగతావారిపై దృష్టి పెట్టారు. మరో ముగ్గురు అధికారులు విదేశాలకు వెళ్లినట్టు భావించిన అధికారులు.. వారిపై లుక్‌అవుట్ నోటీసులు జారీ చేశారు. గురువారం ఉదయం మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు ఇంటికి పోలీసులు వచ్చాయి. ఫోన్ ట్యాపింగ్ అంశంలో ప్రణీత్‌రావుకు రాధాకిషన్‌రావు ఇచ్చిన ఆదేశాలపై పోలీసులు విచారించారు. ముఖ్యంగా ఫోన్‌ట్యాపింగ్ సమాచారంతో ఎక్కడెక్కడ ఆపరేషన్ చేపట్టారు? హవాలా లావాదేవీల క్రమంలో ఏం జరిగింది? వ్యాపారులను బెదిరించి అక్రమంగా డబ్బు సంపాదించారన్న ఆరోపణలపై గుచ్చిగుచ్చి ప్రశ్నించినట్లు తెలుస్తోంది. అటు రాధాకిషన్‌రావు, గట్టుమల్లును పోలీసులు విచారిస్తున్న క్రమంలో బేగంబజార్‌లో కొందరు వ్యాపారులు అజ్ఞాతంలోకి వెళ్లినట్టు తెలుస్తోంది. అప్పట్లో టాస్క్‌ఫోర్స్ తరచూ బేగంబజార్‌లో సోదాలు నిర్వహించేది. ఆ ప్రాంతంలో గంజాయి, హవాలా దందాల్లో ప్రమేయమున్న వ్యాపార సంస్థలపై దాడులు చేశారు. ఈ క్రమంలో కొందరు వ్యాపారులతో టాస్క్‌ఫోర్స్ అధికారులతో రిలేషన్ ఏర్పడిందనే ప్రచారమూ లేకపోలేదు. రాధాకిషన్‌రావు, గట్టుమల్లులను విచారిస్తున్న విషయం బయటకు రాగానే ఈ వ్యాపారులు అజ్ఞాతంలోకి వెళ్లినట్టు సమాచారం. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్‌లో సుధీర్ఘంగా పనిచేసిన రాధాకిషన్ రావుతోపాటు ఆయన టీమ్‌పై పలు ఆరోపణ లు ఉన్నాయి. ఆయన మల్కాజ్‌గిరి ఏసీపీగా ఉన్న సమయంలో ఓ కాంగ్రెస్ నేత ఆత్మహత్యకు కారణమయ్యారనే అభియోగాలు ఎదుర్కొన్నారు. విచారణ తర్వాత ఆ కేసు నుంచి బయటపడ్డారు. ఉద్యోగ విరమణ తర్వాత రెండు విడతలుగా ఆయనే ఓఎస్డీగా కొనసాగడం వెనుక అప్పటి ప్రభుత్వ పెద్దల ఆశీస్సులు ఉన్నాయనే వార్తలు లేకపోలేదు.అయితే శాసనసభ ఎన్నికల నియమావళి అమల్లో ఉన్న సమయంలో రాధాకిషన్‌రావుపై అప్పటి కమిషనర్ సందీప్ శాండిల్య ఎన్నికల కమిషనర్‌కు ప్రత్యేక నివేదిక పంపడంతో ఆయనను టాస్క్‌ఫోర్స్ బాధ్యతల నుంచి తప్పించారు. ప్రభుత్వం మారడంతో ఆయన తన పదవికి రాజీనామా చేశారు. ఇదిలావుండగా మరో ముగ్గురు టాస్క్‌ఫోర్స్ పోలీసులను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. వారి ఫోన్లను అధికారులు స్వాధీనం చేశారు. క్షేత్రస్థాయి ఆపరేషన్లలో వీరి ప్రమేయం ఉన్నట్లు గుర్తించిన నేపథ్యంలో వారిని కూడా విచారిస్తున్నట్లు సమాచారం. ఇక ప్రణీత్‌రావుకు డ్రైవర్‌గా పనిచేసిన వ్యక్తితోపాటు ఓ కానిస్టే బుల్ సైతం పోలీసుల అదుపులో వున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా డిసెంబర్ నాలుగున ఎస్ఐబీలో హార్డ్‌డిస్క్‌లను ధ్వంసం చేయడం తోపాటు వాటిని మూసీ నదిలో పారేయడం వెనుక వీరి ప్రమేయం ఉన్నట్లు భావిస్తున్నారు. ఈ కేసులో ఇప్పటికే అరెస్టయిన అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నలను ఐదురోజుల పోలీసుల కస్టడీకి ఇస్తూ నాంపల్లి కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. శుక్రవారం నుంచి ఏప్రిల్ రెండు వరకు కస్టడీ విధించింది.

# ఆ ఇద్దరూ కాళ్లు పట్టుకున్నా రానివ్వం

- పార్టీలో ఉంటూనే వెన్ను పోటు పొడిచారు
- పిచ్చోని లెక్క ఆ ఇద్దరినీ నమ్మాను - రంజిత్ రెడ్డి, పట్నం మహేందర్ రెడ్డిలపై కెటిఆర్ విమర్శలు - చేవెళ్ల సమీక్షకు డుమ్మా కొట్టిన ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

**హైదరాబాద్,మార్చి 29(పిసిడబ్ల్యూ న్యూస్):** ఇంటి దొంగలే బీఆర్ఎస్‌కు వెన్నుపోటు పొడిచారని మాజీ మంత్రి కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పట్నం మహేందర్ రెడ్డికి పార్టీ తక్కువేం చేయలేదని, అయినా ఆయన పార్టీని విడిచి వెళ్లిపోవడం దారుణమని అన్నారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం చేవెళ్ల సెగ్మెంట్ పార్టీ నేతలతో ఆయన మాట్లాడుతూ రంజిత్ రెడ్డి చాలా మాటలు చెప్పాడని, చివరకు హ్యాండిచ్చి వెళ్లిపోయాడని అన్నారు. పిచ్చోని లెక్క ఆ ఇద్దర్నీ నమ్మినానని ఆవేదన వ్యక్తం చేశారు. మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం బరిలో నిలబడి పోట్లాడదామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సవాల్ విసిరినా, ఆయన స్వీకరించేలేదన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో సీనియర్ నేతలు కడియం, కేకే కాంగ్రెస్ లో చేరుతున్నారని కేటీఆర్ అన్నారు. చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీకి ద్రోహం చేశారని వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ రేపు వచ్చి ఇదే రంజిత్ రెడ్డి, పట్నం మహేందర్ రెడ్డి.. కేసీఆర్ కాళ్లు పట్టుకున్నా పార్టీలోకి రానివ్వం. వాళ్లకుండా తప్పకుండా బుద్ధి చెప్పాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. అయితే ఈ సమావేశానికి ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ డుమ్మా కొట్టారు. అసెంబ్లీ ఎన్నికల్లో 39 స్థానాలు గెలిచిన తర్వాత.. రంజిత్ రెడ్డి ఫోన్ చేసి ఏదేమైనా సరే.. అడ్వాన్స్‌గా ఎన్నికలకు పోవాలి.. ఫస్ట్ మీటింగ్ చేవెళ్లలో పెట్టి నన్ను అభ్యర్థిగా డిక్లేర్ చేస్తే పనిలో పడుతాను.. చేవెళ్లలో గెలిచి చూపించాలి. ఇక అందరికీ ఫోన్ చేసి తెలంగాణ భవన్‌లో మీటింగ్ పెట్టాం. అన్ని నియోజకవర్గాల్లో కార్యకర్తల సమావేశాలు పెట్టుకోవాలని నిర్ణయించుకున్నాం. అన్ని నియోజక వర్గాల్లో తిరుగుదాం అని నిర్ణయించుకున్నాం. నేనే చేవెళ్ల అభ్యర్థిని రంజిత్ రెడ్డి మీడియాతో చెప్పారు. ఇక తెలంగాణ భవన్ నుంచే చేవెళ్ల, పరిగి పర్యటనకు రంజిత్ రెడ్డితో కలిసి కారులో బయల్దేరాం. మన్నెగూడ వద్ద పట్నం మహేందర్ రెడ్డి కారు ఎక్కారు. ముగ్గురం కలిసి పోతుంటే.. మహేందర్ రెడ్డికి నీ మీద పుకార్లు వస్తున్నాయి అని చెప్పాను అని



కేటీఆర్ తెలిపారు. ఇక పరిగి, చేవెళ్ల మీటింగ్స్‌లో నా కంటే ఎక్కువగా కాంగ్రెస్ పార్టీని పొల్లుపొల్లు తిట్టారు. పరిగిలో నాలుగైదు వేల మంది మీటింగ్‌లో ఉన్నారు. కారులో చెప్పిన ముచ్చట కార్యకర్తల ముందు చెప్పమని పట్నం మహేందర్ రెడ్డికి సూచించాను. కాంగ్రెస్‌లోకి పోతున్నట్లు నా మీద పుకార్లు వస్తున్నాయి. నా ఒక్కని మీద వస్తలేవు.. రంజిత్ రెడడి మీద కూడా వస్తున్నాయి అని మహేందర్ రెడ్డి అన్నారు. ఇక ఇద్దరు లొల్లి పెట్టుకున్నారు. ఆస్కార్ అవార్డు కంటే ఎక్కువగా యాక్టింగ్ చేశారు. నేను ఇద్దర్నీ నమ్మాను. అద్భుతమైన స్పీచ్‌లు ఇచ్చారు. చూస్తే 15 రోజుల తర్వాత కాంగ్రెస్ అభ్యర్థులుగా ప్రకటించారు అని కేటీఆర్ తెలిపారు. 2014లో విశ్వేశ్వర్ రెడ్డిని పట్టుబట్టి పార్టీలోకి తీసుకొచ్చాను. ఆయనకు ఏమైందో తెలియదు కానీ కాంగ్రెస్‌లోకి వెళ్లారు. 2018లో విశ్వేశ్వర్ రెడ్డిని ప్రజలు ఓడగొట్టారు. 2018లో రంజిత్ రెడ్డి కొత్త వ్యక్తి అయినా మీరందరూ ఆశీర్వదించి గెలిపించారు. ఇవాళ రంజిత్ రెడ్డి ద్రోహం చేశారు. బయటివాడు మోసం చేస్తే బాధ అనిపించదు. నీతోనే నీడలాగా తిరిగి, నీతోనే అన్ని మంచి మాటలు చెప్పి, కష్టకాలంలో ఉంటామని మాట చెప్పి.. కవిత అరెస్టు అయినరోజే నవ్వుకుంటా రంజిత్ రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. దాన్ని మనం తప్పకుండా తీర్చుకోవాలి. రాజకీయాల్లో ఎవరికీ అధికారం శాశ్వతం కాదు. అధికారం పోగానే తమ స్వీయ ప్రయోజనాల కోసం ద్రోహం చేసి పోతున్నారు. చందన్‌వెల్లిలో రంజిత్ రెడ్డినే పరిశ్రమలు తెచ్చారట. కాలే యాదయ్య, అవినాష్ రెడ్డి సహకారం లేకుండానే పరిశ్రమలు తీసుకొచ్చానని రంజిత్ రెడ్డి అంటున్నారు. ఇంత కంటే సిగ్గుచేటు ఉండదు. ఇంటి దొంగను ఈశ్వరుడు కూడా పట్టలేడు అంటూ పట్నం మహేందర్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. ఇకపోతే అసెంబ్లీ ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో ప్రచారంలో పాల్గొన్నాను. 4 స్థానాల్లో గెలిచాం. కుల్కచర్లలో మీటింగ్ చూసిన తర్వాత పరిగి ఎమ్మెల్యే భారీ మెజార్టీతో గెలుస్తారని అనుకున్నాను. అంత జోష్, ఉత్సాహం ఉండే. స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యాం. వికారాబాద్‌లో కూడా తండోపతండాలుగా వచ్చారు. కానీ ఏం జరిగిందో తెలియదు కానీ స్వల్ప తేడాతో ఓడిపోయాం. తాండూరులో గెలుపు ఏకపక్షంగా ఉంటుందనుకున్నా. మహేందర్ రెడ్డిని బిజీగా పెట్టాం. పోటీ లేదు. ఎదురు లేదనుకున్నాం.. ఇంటి దొంగను ఈశ్వరుడు కూడా పట్టలేడు అని పెద్దలు చెబుతారు. మంత్రిని చేశాం.. ఇక లొల్లి పెట్టడు అనుకున్నాం. మెతుకు ఆనంద్, పైలట్ రోహిత్ రెడ్డికి సహకరిస్తడు అనుకున్నాం. కానీ పట్నం మహేందర్ రెడ్డి, ఆయన భార్య సునీత ఆ రెండు నియోజకవర్గాల్లో అడ్డా పెట్టి, పార్టీలోనే ఉండుకుంటూ వెన్నుపోటు పొడిచి మన నాయకులను ఓడగొట్టారు. మెతుకు ఆనంద్, రోహిత్ రెడ్డి ఓటమికి మన వాళ్లే కారణం అనేది అక్షర సత్యం. మోసం పోయాం అని కేటీఆర్ తెలిపారు.

## ఫోన్ ట్యాపింగ్‌లో సుమోటో కేసు పెట్టాలి

- కెటిఆర్ స్వయంగా ట్యాపింగ్ ఒప్పకున్నాడు
- సినిమా హాళ్లల్లో ఇష్టారీతిన రేట్లు పెంచితే ఊరుకోం
- మంత్రి కోమటిరెడ్డి హెచ్చరికలు

**హైదరాబాద్,మార్చి 29(పిసిడబ్ల్యూ న్యూస్):**ఫోన్ ట్యాపింగ్ పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కౌంటర్ ఇచ్చారు. మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా కెటిఆర్‌ను సుమోటోగగా కేసు పెట్టి అరెస్ట్ చేయాలన్నారు. ఫోన్ ట్యాపింగ్ జరిగిందని కేటీఆరే ఒప్పుకున్నారన్నారు. ఇద్దరి ముగ్గురి ట్యాపింగ్‌పై వ్యాఖ్యలను సుమోటోగా తీసుకొని కేసు బుక్ చేయాలన్నారు. ఫోన్ ట్యాపింగ్ పై కేసు ప్రూవ్ అయితే కేటీఆర్‌కు పదేళ్ల జైలు శిక్ష పడుతుందన్నారు. సినిమా వాళ్ళ ఫోన్స్ కూడా ట్యాపింగ్ చేశారని తెలిసిందన్నారు. కాశీం రజ్వీ కంటే గొప్పోల్లు కేసీఆర్ వద్ద ఫోన్ ట్యాపింగ్ చేసిన వాళ్లని కోమటిరెడ్డి అన్నారు. త్వరలో సినిమా థియేటర్లపై దాడులు జరుగుతాయని కోమటిరెడ్డి తెలిపారు. ఇష్టం వచ్చినట్లు సినిమా హాల్లో రేట్లు పెంచి వసూలు చేస్తున్నారన్నారు. మా డిపార్ట్‌మెంట్ టీంలు సినిమా హాళ్లపై నిఘా ఉంచాయన్నారు. తేడా వస్తే థియేటర్లను సీజ్ చేస్తామన్నారు. సినిమా ప్రమోషన్ల కు, క్లాపింగ్‌లకు తాను రానని ఇండ్రస్టీలో ఉన్న వారికీ చెప్పానన్నారు. ఎక్కువ బ్జడెట్ పేరుతో సినిమాలు తీసి టికెట్ రేట్లు పెంచాలి అంటే కష్టమన్నారు. దీని వల్ల చిన్న సినిమాను నమ్ముకున్న వాళ్లకు తీరని నష్టం జరుగు తోందన్నారు. సినిమా వాళ్ళ ఫోన్ ట్యాపింగ్ అంశంలో తనకు ఇప్పటి వరకూ ఎలాంటి ఫిర్యాదులూ రాలేదన్నారు. తనకు ఫిర్యాదు చేస్తే అప్పుడు ఆలోచన చేస్తామని కోమటిరెడ్డి పేర్కొన్నారు. ఇక పనిలో పనిగా.. ఎమ్మెల్యే దానం నాగేందర్ విషయంపై కూడా మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పందించారు. ఎమ్మెల్యేగా రాజీనామా చేయకుండా ఎంపీకి పోటీ కష్టమేనని భావిస్తున్నట్టు తెలిపారు. ఒక పార్టీలో ఎమ్మెల్యేగా గెలిచి... ఇంకో పార్టీలో ఎంపీగా పోటీ అంటే లీగల్ సమస్యలు వస్తాయని అభిప్రాయ పడుతున్నట్టు పేర్కొన్నారు. కొత్త వాళ్ళకు టికెట్ ఇవ్వడం అంటే గెలిచే వాళ్లకు ఇస్తున్నారని తెలిపారు. అలాగని అది పాత వాళ్లకు అన్యాయం కాదన్నారు. వారికి తామంతా ఉన్నామన్నారు. హైదరాబాద్ లాంటి వీక్ ఉన్న స్థానాల్లో గెలిచే వాళ్ళకే టికెట్లు ఇస్తున్నారని కోమటిరెడ్డి తెలిపారు.



# తెలంగాణ ద్రోహి కడియం శ్రీహరి.. ఎమ్మెల్యే పదవికి వెంటనే రాజీనామా చేయాలి..!

**- పచ్చి అవకాశవాది కడియం.. - కడియం ఎమ్మెల్యేగా రాజీనామా చేయాలని డిమాండ్.. - దళిత నాయకులను ఎదగనీయని కుట్రదారు శ్రీహరి**





**హనుమకొండ ప్రతినిధి, మార్చి 29 (పీసీడబ్ల్యూ న్యూస్):** కుట్రాలు,కుతంత్రాలు చేసి అధిష్టానానికి తప్పుడు సమాచారం అందిస్తూ, నీచమైన రాజకీయాలు చేసిన వ్యక్తి కడియం శ్రీహరి అని, కనీస నైతికత, వయస్సు పై గౌరవం ఉంటే ముందుగా స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి తర్వాత ఏ పార్టీలోనైనా చేరాలని కడియం శ్రీహరికి మాజీ చీఫ్ విప్ హనుమకొండ బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ డిమాండ్ చేశారు. నిత్యం నీతులు చెప్పే శ్రీహరి కనీసం ఈ సారైనా పాటించాలని సూచించారు. ఏ పార్టీలో ఉన్నా, స్వలాభం కోసం, నీ రాజకీయ ఎదుగుదల కోసం ఆ పార్టీలో తనకన్నా ముందున్న నాయకులను, కార్యకర్తలను అణచివేసి అహంకారపూరితంగా వ్యవహరించిన కుట్రలు అనేకం ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.గతంలో టీడీపీలో పనిచేసినపుడు ఆ పార్టీ నేత చంద్రబాబును బ్లాక్ మెయిల్ చేసి అనేక పదవులు అనుభవించారని గుర్తుచేశారు.ఎదుగుతున్న దళిత నాయకులపై కుట్రలు చేసి, చాడీలు చెప్పిన నీచమైన చరిత్ర అంటూ విమర్శించారు. గత అహంకార పూరిత చర్యలు మరిచి తెలంగాణ కోసం నేనూ, కెటీఆర్, పెద్ది నిస్వార్థంతో పార్టీలోకి ఆహ్వానించామన్నారు.బీఆర్ఎస్‌లోకి రాగానే నీ స్వార్థానికి విజయరామారావు,రాగమళ్ళ పరమేశ్వర్, దొమ్మాటి సాంబయ్య, పసునూరి దయాకర్, అరూరి రమేష్ లు నీ కోసం, నీపదవుల కోసం బలైపోయారని వివరించారు. సిట్టింగ్ ఎమ్మెల్యేను రాజయ్యను కాదని నీకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించారన్నారు. నీతి, నిజాయితీ అంటూ నీవు బ్లాక్ మెయిల్ చేసి నీ బిడ్డ కోసం వరంగల్ ఎంపీ టికెట్ సాధించావని వివరించారు. నీ మీద, కావ్య అభ్యర్థిత్వం పై అనేక మంది ఉద్యమకారులు, దళిత సంఘాలు వ్యతిరేకించినా వారిని ఒప్పించే ప్రయత్నం చేశారన్నారు. కానీ, రాత్రికి రాత్రే కాంగ్రెస్ పార్టీతో ప్రత్యేక ప్యాకేజీ ఏర్పాటు చేసుకుని నువ్వూ, నీ బిడ్డ ఓ లేఖను విడుదల చేయడం సిగ్గుచేటన్నారు. పార్టీలోకి వచ్చిన కొద్ది కాలానికే ఎన్ని పదవులు ఉంటే అన్నింటిని అనుభవించిన చరిత్ర కడియం శ్రీహరి దంటూ నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి గుర్తు చేశారు. పార్టీ అన్ని పదవులు అనుభవించి అధికారం కోల్పోగానే ద్రోహం చేసే చరిత్ర కడియం శ్రీహరి దంటూ విమర్శించారు. ఇప్పటి నుంచి శ్రీహరి రాజకీయ విలువలు, నిజాయితీ అంటూ నీతులు చెప్పడం మానుకోవాలని సూచించారు. ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఎమ్మెల్యేగా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకాలమంతా టీడీపీలో ఉండి తర్వాత బిఆర్ఎస్‌లో చేరినా నీకు ఎంపీ పదవి, ఆ తర్వాత ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ, నీ కోసం వరంగల్ ఎంపీ ఉప ఎన్నికలు తెచ్చారని వివరించారు. తర్వాత ఖాళీగా ఉంటున్నావంటే మరోసారి ఎమ్మెల్సీ ఇచ్చారని చెప్పారు. ఎమ్మెల్సీగా ఉంటూ స్టేషన్ ఘన్ పూర్ లో రాజకీయం చేస్తే అక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యేను కాదని నీకు ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చారన్నారు. తాజాగా నీ బిడ్డకు ఎంపీ టికెట్ సైతం ఇచ్చారని చెప్పారు. ఇన్ని పదవులు అనుభవించేందుకు ఎందరో దళిత, ఉద్యమ నాయకులు త్యాగాలు చేశారనే అంశాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఇప్పుడు రాత్రికి రాత్రి కాంగ్రెస్ లో చేరేందుకు ప్యాకేజీకి సిద్ధమయ్యావని అధికారం ఎక్కడ ఉంటే అక్కడ ఉంటూ నీతులు చెప్పడం నీకు రివాజుగా మారిందన్నారు. కడియం లాంటి వ్యక్తుల నుంచి కాంగ్రెస్ పార్టీ వాళ్లు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.. రేపటి నుంచి కాంగ్రెస్ లో కూడా ఇద్దరిని కలువనియ్యరని గుర్తుచేశారు.మా పార్టీ నుంచి వచ్చే వారి పట్ల కాంగ్రెస్ నాయకులు జాగ్రత్తవహించాలని హెచ్చరించారు. జడ్పీ చైర్ పర్సన్ సుధీర్ కుమార్ మాట్లాడుతూ.. బి ఆర్ ఎస్ కు షాక్ అని అంటున్నారు కానీ,అది కాంగ్రెస్ కే షాక్ అని అన్నారు. ఎందుకంటే ఏ ఎమ్మెల్యేను ఓర్వ కుండా, దళితులను ఎదుగనియకుండా చేశారని అన్నారు. కడియం శ్రీహరి దళిత ద్రోహి అని అన్నారు.ఉద్యమకారుడు, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కూడా ఏ ఒక్క దళితున్ని కూడా ఎదగకుండా చేస్తారని అన్నారు.కుట్రలు,కుతంత్రాలు చేసి దళిత నాయకులను బలహీన పరుస్తారని విమర్శించారు.దీనివల్ల కాంగ్రెస్ పార్టీకి నష్టమే కాని, లాభం కాదని అభివర్ణించారు. అనంతరం మైనారిటీ నేత నయీమొద్దీన్ అధ్వర్యంలో పార్టీ కార్యాలయం వద్ద కడియం దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సమావేశంలో జడ్పీ చైర్మెన్ సుధీర్‌కుమార్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే లు చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకట రమణారెడ్డి, నన్నపునేని నరేంద ర్, మాజీ చైర్మన్ లు నాగుర్ల వెంకటేశ్వర్లు,మర్రి యాదవ రెడ్డి,సుదందర్ రాజు యాదవ్, కార్పొరేటర్లు,మాజీ కార్పొరేటర్లు,బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా.. టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**- కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ**





**హనుమకొండ ప్రతినిధి, మార్చి 29 (పీసీడబ్ల్యూ న్యూస్):** తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు వరంగల్ పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అర్చన పెల్లి విద్యాసాగర్ రావు ఆధ్వర్యంలో శుక్రవారం కాజిపేట్ బాబుజీ నగర్ టిడిపి పార్లమెంట్ కార్యాలయంలో 42వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి వరంగల్ పార్లమెంట్ అధ్యక్షులు అర్చన పెల్లి విద్యాసాగర్ రావు ముఖ్య అతిథిగా విచ్చేసి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, తెలుగుదేశం పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం విద్యాసాగర్ రావు మాట్లాడుతూ.. తెలుగుదేశం పేదల పార్టీ అని, గూడు, గుడ్డ కల్పించడమే లక్ష్యంగా ఆవిర్భవించిందే.. తెలుగుదేశం పార్టీ అన్నారు. అన్న ఎన్టీఆర్ ఆశయాలు ముందుకు తీసుకెళ్లడమే మన కర్తవ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిశెట్టి సతీష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కలమాల మహేందర్, రాష్ట్ర కార్యదర్శి బైరి శేషాద్రి, పార్లమెంటు ఉపాధ్యక్షులు బర్ల యాకూబ్, కొంగర ప్రభాకర్, విమల, రాధిక తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్, హనుమకొండ న్యాయవాద బార్ అసోసియేషన్ విజేతలు

**- వరంగల్ అధ్యక్షులుగా తీగల జీవన్**
**- హనుమకొండ అధ్యక్షులుగా మాతంగి రమేష్**
**- హనుమకొండ ప్రధాన కార్యదర్శిగా లడే రమేష్**
**- వరంగల్ ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ ముజ్సర్ హైమద్ ఖాయ్యుం**



**హనుమకొండ ప్రతినిధి, మార్చి 29 (పీసీడబ్ల్యూ న్యూస్):** అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రతి సంవత్సరం జరిగే వరంగల్ హనుమకొండ న్యాయవాద (బార్ అసోసియేషన్) జిల్లా న్యాయస్థానం ప్రాంగణంలో జరిగిన ఎన్నికల్లో 887 మంది న్యాయవాదులకు గాను 737 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓట్ల లెక్కింపు అనంతరం ముఖ్య ఎన్నికల నిర్వహకులు ఈ శ్రీనివాస్ రెడ్డి ఫలితాలను గురువారం రాత్రి 8:30 గంటలకు ప్రకటించారు. ఈ ఫలితాలలో వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా 'తీగల జీవన్" తన సమీప ప్రత్యర్థి వై రాఘవరావు పై 75 ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఉపాధ్యక్షులుగా సుదర్శన్ విజయం సాధించగా ప్రధాన కార్యదర్శి రేసులో మహమ్మద్ సర్ హైమద్ తన ప్రత్యర్థి గంధం శివ పై విజయం సాధించారు.ఇక హనుమకొండ బార్ అసోసియేషన్ ఫలితాలలో అధ్యక్షులుగా 'మాతంగి రమేష్ బాబు" తన సమీప ప్రత్యర్థి పులి సత్యనారాయణ పై విజయ బావుటా ఎగురవేయగా ఉపాధ్యక్షులుగా 'పోసాని రవీందర్"ప్రధాన కార్యదర్శిగా 'లడే రమేష్" ఎన్నికయ్యారు. ట్రెజరరీగా శంకరాచారి ఏకగ్రీవం కాగా మహిలా జాయింట్ సెక్రెటరీగా గోపికారాని క్రీడలు సాంస్కృతిక విభాగంలో వెంకటరమణ గెలుపొందగా లైబ్రరీ సెక్రటరీగా మురళి కుమార్ కార్యవర్గ సభ్యులు (ఈసీ)లు గా రాజేందర్ విక్రమ్ అనిల్ కుమార్ రాజ్ కుమార్ అశోక్ మహిళా ఈసీగా శ్రుతిలు విజయకేతనం ఎగురవేశారు. ట్రెజరీగా సదానందం మహిళా జాయింట్ సెక్రటరీగా సప్న క్రీడలు సాంస్కృతిక విభాగంలో చిరంజీవి ఈసీలుగా రిత్విక సుహాస్ అనిల్ కుమార్ అచ్యుత్ కుమార్ మహిళా ఈసీగా రమాదేవిలు విజయాన్ని దక్కించుకున్నారు. ఈ సందర్భంగా న్యాయవాదులు గెలిచిన టీం లతో కలిసి టపాసులు కాల్చి స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు.

## ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షునికి ఘన సన్మానం



**తొర్రూరు, మార్చి 29(పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా మాటేరు గ్రామానికి చెందిన అడ్వకేట్ కల్వకొలను ప్రవీణ్ రాజు తొర్రూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా వారిని సన్మానించారు. జిల్లా బట్రాజు సంఘం అధ్యక్షుడు ప్రతి కంఠం దేవేందర్ రాజు కోశాధికారి ,నారాయణరాజు సన్మానించారు. నారాయణ రాజు ప్రసంగిస్తూ ఏకగ్రీవంగా ఎన్నికనేది చాలా అరుదుగా ఉంటారని కుల బాంధవుడు కావడంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## తాగునీటి సమస్యని పరిష్కరించాలి: డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్



**మరిపెడ,మార్చి 29 (పిసిడబ్ల్యూ న్యూస్):** నియోజకవర్గంలో ఎక్కడైనా తాగునీటి ఎద్దడి నెలకొంటే, వెంటనే పరిష్కరించాలని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మరిపెడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేసవి కాలంలో తాగునీటి సమస్యను తీర్చేందుకు డోర్నకల్ నియోజకవర్గానికి కోటి రూపాయల సిడిఎఫ్ నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. వాటలో ముప్పై లక్షల నిధులను మరిపెడ మండలంలో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు కేటాయిస్తామన్నారు. అవసరమైతే కలెక్టర్ ద్వారా మరో కోటి రూపాయలను మంజూరు చేస్తామని పేర్కొన్నారు. వేసవిలో భూగర్భజలాలు తగ్గుముఖం పడుతుండడంతో అధికారులు ఎప్పటికప్పుడు తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. శనివారం మరిపెడలో ఇరిగేషన్ అధికారులతో తాగునీటి సమస్య పరిష్కారం కోసం సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెండ్లి రఘువీరారెడ్డి, రవి నాయక్, ఐలమల్లు, వెంకట సాయి గుండగాని వేణు, ముత్యం రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభాన్ని పట్టించుకోని నాదుడే కరువు...

**- బిక్కు బిక్కు మంటున్న కాలనీవాసులు**



**రామడుగు, మార్చి 29(పిసి డబ్ల్యూ న్యూస్):** రామడుగు మండల కేంద్రంలో మూడో వార్డులో పడిపోయే స్థితిలో ఉన్న కరెంటు విద్యుత్ స్తంభం సంవత్సరం క్రితం ప్రమాదంగా ఉన్నదని గుర్తించిన విద్యుత్ సిబ్బంది దాని స్థానంలో మరో స్తంభాన్ని ఏర్పాటు చేశారు కానీ దానికి కనెక్షన్ ఇవ్వడం మర్చిపోయి నారు . ఇనుప స్తంభం తుప్పు పట్టి పడిపోయే స్థితిలో ఉన్న విద్యుత్ అధికారులు మాత్రం ఇటు వైపు కన్నెత్తి చూడడం లేదని కాలనీవాసుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సిబ్బంది దాని స్థానంలో మరో స్తంభాన్ని ఏర్పాటు చేశారు కానీ దానికి కనెక్షన్ ఇస్తే బాగుంటుందని అంటున్నారు.



## ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు




**రామడుగు, మార్చి 29(పిసీడబ్ల్యూ న్యూస్):** రామడుగు మండలంలోని అన్ని గ్రామాల్లోని చర్చిలలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు. లోక పాప పరిహారార్థం ఏసుప్రభు శిలువపై బలి అయిన రోజును క్రైస్తవులు గుడ్ ఫ్రైడే గా వ్యవహరిస్తారు.. నేటి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఏసు క్రీస్తు సిలువపై పలికిన ఏడు మాటలను తలపోస్తూ పాస్టర్లు విశ్వాసులకు వివరిస్తారు.. ఈ సందర్భంగా రామడుగు గోపాలరావుపేట్ గుండి వెదిరా వెలిచాలా దేశరాజు పల్లి తో పాటు అన్ని గ్రామాల్లో గ్రామాలను చర్చిలలో పల్లిప్రత్యేక పాటలు ఆరాధనలు ఆధ్యాంతం కొనసాయి.. గత40 రోజులుగా ఉపవాసం చేస్తున్న క్రైస్తవులు నేటితో ఉపవాస దీక్షను విరమిస్తారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు అబ్రహం పౌలు డేవిడ్ కాంతి కుమార్ మోజెస్ ఏలియా టైటాస్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఎస్టీ కమిషనర్ సభ్యులను సన్మానించిన బిజెపి శ్రేణులు



**తొర్రూర్, మార్చి 29(పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా ముద్దుబిడ్డ జాటోత్ హుస్సేన్ నాయక్ భారత ప్రభుత్వం చే నియమించబడిన జాతీయ ఎస్టీ కమిషనర్ సభ్యులుగా నియామకం అయిన వారిని బిజెపి తొర్రూరు శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్ ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు ఘన సన్మానం చేశారు. మొదటిసారిగా తోరూర్ పట్టడానికి వచ్చిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు ,అలాగే మహబూబాబాద్ నందన గార్డెన్లో పౌర సన్మానం ఏర్పాటు చేయడం జరిగిందని ఈ కార్యక్రమంలో పాల్గొనటానికి వస్తున్న సందర్భంగా తొర్రూర్ అతిథి గృహం వద్ద సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి పాలకుర్తి నియోజకవర్గం కన్వీనర్ పూసాల శ్రీమాన్, జిల్లా ఉపాధ్యక్షుడు రంగా రాములు ,బిజెపి పెద్దవంగర మండల అధ్యక్షుడు బొమ్మన పోయిన సుధాకర్, బిజెపి అర్బన్ ప్రధాన కార్యదర్శి పైండ్ల రాజేష్ ,ఎస్సీ మోర్చా అర్బన్ అధ్యక్షులు మంగళపల్లి యాకయ్య, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణపురం రాజకుమార్, అర్బన్ ఉపాధ్యక్షులు శేఖర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నూతన దంపతులను ఆశీర్వదించిన జెడ్పీటీసీ గొర్రె సాగర్



**చిట్యాల,మార్చి 29 (పీసీడబ్ల్యు న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం నైన్ పాక గ్రామ వాస్త వ్యులు మల్లారపు స్వామి- సావిత్రి గార్ల కుమారుడు ప్రవీణ్ వెడ్స్ ఆశ మరియు రయారకుల రవి సరోజన గార్ల కుమారు ప్రతిప్ వెడ్స్ సాహితి గార్ల రిసెప్షన్ కు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన చిట్యాల జెడ్పీటీసీ గొర్రె సాగర్ బిరవొలు రాంరెడ్డి సంపత్ రెడ్డి దోంతుల రాజేందర్ తదితరులు ఆశీర్వదించారు.

## ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

**టేకుమట్ల, మార్చి 29(పిసిడబ్ల్యూ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని దుబ్యాల గ్రామంలో పోశమ్మతల్లి ప్రధమ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవతామూర్తికి ఆలయ పూజారులు అభిషేఖం, ప్రత్యే పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో ఎపీటీసీల ఫోరం అధ్యక్షులు సంగి రవి, స్థానిక ఎంపీటీసీ బిక్కినేని అనిత సంపత్ రావు, మాజీ సర్పంచ్ బిల్లకంటి ఉమేందర్రావు, సంపత్ రావు , మాజీ ఎంపీటీసీ పోలుదాసరి రాజేశం, ఉత్సవ కమిటీ సభ్యులు రాజేశ్వర్రావు, రవిందర్, మల్లయ్య, శ్రావణ్, శ్రీనివాస్, చంద్రయ్య, సారయ్య, పోశం, రాజు, స్వామిరావు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజాస్వామ్య పునాదులు జర్నలిస్టులు



**మరిపెడ, మార్చి 29 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వానికి,ప్రజలకు మధ్య వారదులుగా జర్నలిస్టులు నిరుస్తారని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ డాక్టర్ జాటోతు రామచంద్రనాయక్ అన్నారు. శుక్రవారం మరిపెడ పట్టణంలో మండల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎమ్మెల్యేను కలవగా ప్రెస్ క్లబ్ కమిటీని ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజాస్వామ్య పరిరక్షణలో జర్నలిస్టుల పాత్ర వెలకట్టలేనిదని కొనియాడారు.ప్రభుత్వ పథకాలను మారుమూల పల్లెలకు చేరవేయడంలో విలేకరుల పాత్ర కీలకమన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తమ యాజమాన్యాలను ధిక్కరించి మరి ఉద్యమానికి స్థానిక జర్నలిస్టులు అండగా నిలబడ్డారని గుర్తు చేశారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వం రిపోర్టర్లను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రిపోర్టర్ల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. పార్లమెంటు ఎన్నికలు ముగిసిన వెంటనే అర్హులైన స్థానిక జర్నలిస్టులకు ఇందిరమ్మ గృహాలు వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామీణ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి వారి అభ్యున్నతి కోసం మండల ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షుడు గండి విష్ణు, అధ్యక్షుడు పర్వతం చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి మారం అనంతరాములు, కోశాధికారి బోడ పట్ల సతీష్ లను శాలువాతో సన్మానించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీరారెడ్డి, ఐలమల్లు, రవినాయక్,అనంత సాయి తదితరులు పాల్గొన్నారు.

## లంబాడీల సాంస్కృతిక, సాంప్రదాయాలు మెరుగుపరచడమే సిఖో సిఖావో కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం

### - గోర్ జాతి ఐక్యత కోసం తండాలలో గూడాలలో పట్టణాలలో గోర్ ధర్మాన్ని పటిష్ట పరచాలి



**ఖమ్మం, మార్చి 29 (పిసీడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):**ఖమ్మం జిల్లా ఎల్ హెచ్ పి ఎస్ కార్యాలయంలో జరిగిన సిఖో సిఖావో కార్యక్రమానికి రవీందర్ నాయక్ సభాధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జై సింగ్ రాథోడ్ పాల్గొని మాట్లాడారు. భారతదేశంలో గోర్ ధర్మము - ఉనికి మన పాత్ర , భారత రాజ్యాంగం అమలు తీరు తెన్నులు - గోర్ జాతి సాధించిన ప్రగతి , వ్యక్తులుగా శక్తులుగా జాతి అభివృద్ధికి చేయాల్సిన కృషి అనే అంశాలపై జిల్లా నలుమూలల నుంచి వచ్చేసిన ఉద్యమకారులు మేధావులు శ్రేయోభిలాషులు విస్తృతంగా చర్చించారు . ఈ సందర్భంగా ఎల్ ఎస్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భద్రు నాయక్ ప్రవేశపెట్టగా సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది . భారత దేశంలో పూర్వం పురాతన మతంగా వెలసిల్లిన గోర్ జాతిని ఒక మతంగా గుర్తించి రాజ్యాంగంలో చేర్చాలి. భారతదేశంలో 20 కోట్ల మంది జనం మాట్లాడే గోర్ బోలిని రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్లో చేర్చాలి. కేంద్ర ప్రభుత్వం, దేశంలోని రాష్ట్ర ప్రభుత్వాలు గోర్ జనాభా ప్రాధిపాదికన నిధులు కేటాయించాలి, విద్యా ఉద్యోగ ఉపాధి రంగాలలో జనాభా వాటా కల్పించాలి . గోర్ జాతి ఐక్యత కోసం తండాలలో గూడాలలో పట్టణాలలో గోర్ ధర్మాన్ని పటిష్ట పరచాలి. పరమత ధర్మాలు ఆచారాలు పాటించేవాళ్లు తిరిగి స్వధర్మంలోకి వచ్చే విధంగా కృషి చేయాలి. సాంస్కృతి సంప్రదాయ పరమైన శిక్షణ తరగతులు నిర్వహించి యువతను చైతన్య చేయాలి. గోర్ చరిత్రకారుల , సామాజిక పరివర్తకుల చరిత్రను కేంద్ర ప్రభుత్వం పాఠ్య పుస్తకాల్లో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలి. సాంస్కృతిక పునర్నిర్మాణానికి, అభివృద్ధికి ప్రతి ఒక్క గోర్ కృషి చేయాలి. ఈ కార్యక్రమంలో లచ్చిరాం నాయక్, కృష్ణ నాయక్, ఉపేందర్ నాయక్, జగదీష్ నాయక్, రవీంద్ర నాయక్, బట్టు రాజశేఖర్, ఉపేంద్ర భాయి, మామిడాల ఝాన్సీ, కృష్ణవేణి, లక్ష్మీ, ఉష, శివనాయక్ , లాలూ నాయక్, కోటేష్ నాయక్, నాగరాజు, రామకృష్ణ, వీరన్న నాయక్, రవి, రాము తదితరులు పాల్గొన్నారు.

## రైతులను రెచ్చగొట్టి ప్రతిపక్ష పార్టీల నాయకులు కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తున్నారు

### - జిల్లా ప్రధాన కార్యదర్శి మధు వంశీకృష్ణ

**చిట్యాల, మార్చి 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** రైతులను తప్పుదోవ పట్టించేందుకు.మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనచారి మతి భ్రమించి మాట్లాడుతున్నారని. కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మధు వంశీకృష్ణ అన్నారు. గత సంవత్సరం జూలైలో భారీ వర్షాలకు నియోజకవర్గం వ్యాప్తంగా ఎస్సార్ ఎస్పీ కాల్వలు, చెరువులు, కుంటలు తెగిపోతే మారమ్మత్తు పనులు చేయించని అసమర్థ బిఆర్ఎస్ పార్టీ అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు తోనే సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా నిర్వహించి, కోట్లాది నిధులను మంజూరి చేయించిన ఘనత ఎమ్మెల్యే, గండ్ర సత్యనారాయణ రావు అని అన్నారు. వానాకాలం లోపు కాల్వలు, చెరువుల మరమ్మత్తు పనులు పూర్తి చేయించి రైతులకు సాగు నీరు అందిస్తామన్నారు. తొమ్మిది సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు రైతులను పట్టించు కోని మీరు రాజకీయ పబ్బం గడిపేందుకే రైతులను ఆదుకోవల్సింది పోయి రైతులను రెచ్చగొట్టి ప్రతిపక్ష పార్టీల నాయకులు కాంగ్రెస్ పై విమర్శలు చేస్తున్నారని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలకే ఇచ్చిన హామీలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేసే విధంగా ముందుకు సాగుతున్నారని.కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు పెద్దపీట వెయ్యడమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మధు వంశీకృష్ణ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి చిలుకల రాయకొమురు,స్థానిక ఎంపీటీసీ ధబ్బేట అనిల్,మండల కో ఆప్షన్ సభ్యులు మహ్మద్ రాజ్ మహ్మద్, టౌన్ యూత్ అద్యక్షులు అల్లం రాజు తదితరులు పాల్గొన్నారు.



## బిజెపి ఆధ్వర్యంలో రాస్తారోకో...

### రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం



**గంగాధర, మార్చి 29(పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో రైతులను ఆదుకుంటామని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ మూడు నెలల ముచ్చటగానే మిగిలిపోయిందని భారతీయ జనతా పార్టీ చొప్పదండి నియోజకవర్గం కన్వీనర్ పెరక శ్రవణ్ ఆరోపణలు చేశారు. సందర్భంగా గంగాధర మండలం కరీంనగర్ జగిత్యాల ప్రధాన రహదారి కురిక్యాల వరద కాలువ బ్రిడ్జిపై భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రాస్తారోకో చేపట్టారు. ఈ రాస్తారోకో సందర్భంగా ప్రధాన రహదారి ఇరువైపులా వాహనాలు ఎక్కడికి ఎక్కడ స్తంభించిపోయాయి. అనంతరం విలేకరుల ఉద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు న్యాయం చేస్తానని తీరా వరి పంట కోత దశకు వచ్చేసరికి నీళ్లు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందంటూ మేడిపల్లి సత్యం చెప్పానని నియోజకవర్గంలో మాయమాటలతో గెలిచి పబ్బం గాడుకుంటున్నారని కనీసం రైతులను ఆదుకోవడంలో చొరవ చూపడం లేదంటూ విమర్శించారు. ఎస్సారెస్పీ నుండి నీటిని విడుదల చేస్తే కనీసం ఈ వేసవి కాలంలో పంటలు బయటపడతాయని లేదంటే పూర్తిగా ఎండిపోతున్నాయని దీనిపై ప్రభుత్వం వెంటనే పట్టించుకోని రైతులకు సరిపడా నీళ్లు వరద కళాధార విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెద్ద మొత్తంలో కలెక్టర్ కార్యాలయాన్ని ముద్రయించే పరిస్థితి ఏర్పడుతుందని ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను దృష్టిలో పెట్టుకొని నీటిని విడుదల చేసి చర్యలు చేపట్టాలని హెచ్చరించారు. నియోజకవర్గ స్థాయి బిజెపి నాయకులు కార్యకర్తలు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌కి ద్రోహం చేసిన కేకే, కడియం శ్రీహరి చరిత్ర హీనులుగా మిగిలిపోతారు

### బిఆర్ఎస్ యువజన విభాగం భక్తు విజయ్ కుమార్



**రామడుగు, మార్చి 29(పిసిడబ్ల్యూ న్యూస్):** రామడుగు కెసిఆర్ భిక్షతో అనేక పదవులు పొందిన కేశవరావు కడియం శ్రీహరి ఇవాళ ప్రభుత్వం కోల్పోయిన తర్వాత బిఆర్ఎస్ పార్టీకి అండగా నిలవలిసిపోయి తమ రాజకీయ పబ్బం కోసం రంగులు మార్చే ఊసరవెల్లిలాగా మారి ఈరోజు కేసీఆర్ బిఆర్ఎస్ పార్టీకి ద్రోహం చేసిన వీళ్ళిద్ద రిని తెలంగాణ ప్రజలు రాజకీయ బొంద పెట్టాలని ఇలాం టి రాజకీయ బిక్షగాలను తెలంగాణ పొలిమేర నుండి తరి మి కొట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పది సంవత్సరాలు పాటు అనేక పదవులు పొంది ఈరోజు కష్టకాలంలో ఉన్న పార్టీని బదనాం చేస్తూ పార్టీ మారడం అంటే వాళ్ల నీచ సంస్కృతి నిదర్శనం ఇలాంటి ద్రోహులు ఎంత మంది పార్టీ మారినా బిఆర్ఎస్ పార్టీ కానీ కెసిఆర్ ఒరిగేదేమీ లేదనీ బిఆర్ఎస్ పార్టీకి ఉక్కు కవచంలా తెలంగాణ ఉద్యమకారులు తెలంగాణ ప్రజలు ఉన్నారని పార్టీ నచ్చని వీళ్లకు పార్టీ గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యే రాజ్యసభ సభ్యత్వానికి తక్షణమే రాజీనామా చేసి పార్టీ మారాలని అలా కాకుండా సాకులతో రాజీనామా చేయకుండా ఉంటే తెలంగాణ ప్రజలు బొంద పెడతారని పార్టీ కాదని వెళ్లే వాళ్లు తమ చిత్తశుద్ధి చాటుకుని పదవులకు రాజీనామా చేసి వెళ్లాలని అలా చేయని వారికి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించి తెలంగాణ ప్రజల సత్తా చాటాలని తెలంగాణలో ఉన్న ఉద్యమకారులు నాడు ఉద్యమంలో ఏ విధంగా ఐక్య మత్యంతో ముందుకు వెళ్లారు. కష్ట కాలంలో ఉన్న పార్టీని పార్టీ ప్రతిష్టలు కాపాడుకోవడం కోసం పార్టీ ద్రోహులు ఉన్నవారికి తగిన గుణపాఠం చెప్పాలంటే పార్లమెం టులో అత్యధిక సీట్లు వచ్చే విధంగా ప్రతి ఒక్క కార్యకర్త సైనికుల పని చేయాలని విజ్ఞప్తి చేశారు.

## పిసిడబ్ల్యూ న్యూస్ కథనానికి స్పందన




**తొర్రూరు, మార్చి 29,( పీసీడబ్ల్యు న్యూస్):** ఈనెల 23న ప్రచురించిన చీకట్లో బెల్ట్ షాపులా అడ్డాలుగా మారుతున్న స్థలాలపై వచ్చిన కథనానికి అధికారులు స్పందిం చారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల కేంద్రంలోని గుర్తూర్ గ్రామ పంచాయతీలో గత ఎన్నికలకు ముందే గ్రామపంచాయతీకి మూడు లైటింగ్ టవర్స్ రాగా గతంలో రెండు లైట్లు గ్రామంలో అమర్చారు. గ్రామంలో ఉన్న గ్రామప ంచాయతీ ప్రాంతంలో చీకట్లో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని గతంలో అధికారుల దృష్టికి గ్రామస్తులు తీసుకువెళ్లిన ఎవరు పట్టించుకోలేదు .రానున్న పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రజా ప్రతినిధులు ముందుగానే మంజూరైన లైటింగ్ టవర్ ను గ్రామపంచాయతీ ముందు శుక్రవారం ఏర్పాటు చేశారు.చీకట్లను చీల్చుకొని వెన్నెలలా వెలుతురు వస్తున్న వెలుతురు చూసి గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



## జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ హుస్సేన్ నాయక్‌ని సన్మానించిన కొత్తగూడ బిజెపి నాయకులు



**నర్సంపేట, మార్చి 29(పిసిడబ్ల్యూ న్యూస్):** జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్‌గా నియమింప బడి మొదటి సారిగా మహబూబాబాద్ జిల్లా కేంద్ర సన్మాన సభకి హాజరైన జాటోత్ హుస్సేన్ నాయక్‌ని కొత్తగూడ బీజేపీ మండల కమిటీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇ సందర్భంగా బీజేపీ గిరిజన మోర్చా వనభందు సెల్ రాష్ట్ర కన్వీనర్ బోడ నవీన్ నాయక్ మాట్లాడుతూ కొత్తగూడ ప్రాంతం అభివృద్ధికి ఆమడ దూరం లో ఉంది కనీస సదుపాయలు లేవు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమం లో బీజేపీ మండల అధ్యక్షుడు యాదగిరి మురళి, మాజీ అధ్యక్షుడు జాడి సారయ్య, మండల ప్రధాన కార్యదర్శి తోటకూరి. మధు, సీనియర్ నాయకులు గంగాపూరం. బిక్షపతి, గుగులోత్. రూప్లా నాయక్,పిన్నింటి. రవీందర్,రామనర్సయ్య, యాకన్నా,బోడ. సుమన్ నాయక్,తదితరులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లిలోని ఎన్‌కె ఎన్ఆర్ గార్డన్స్‌లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం



**మేడ్చల్ మల్కాజ్గిరి, మార్చి 29 (పిసిడబ్ల్యూ న్యూస్):** మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఎన్నికల నేపథ్యం లో కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం కూకట్పల్లిలోని ఎన్‌కెఎన్ఆర్ గార్డెన్‌లో జరిగింది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ మంత్రి ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి ,మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి , పార్లమెంట్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి మరియు కూకట్పల్లి నియోజకవర్గ ఇన్చార్జిబండి రమేష్ తో కలిసి పాల్గొన్న కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టుముక్కల వెంకటేశ్వర రావుఈ సమావేశం లో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి గెలుపు కోసం కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు అనుసరించాల్సిన విధివిధానాలపైన దిశ నిర్దేశనం చేశారు.

## గుడ్ ఫ్రైడే సందర్భంగా బల్లేపల్లి విచారణ పరిధిలో ఘనంగా సిల్వ మార్గం నిర్వహించారు



**ఖమ్మం, మార్చి 29 (పిసీడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** ఫాదర్ ఆంటోనీ, ఫాదర్ మనోహర్‌ల ఆధ్వర్యంలో కైకొండాయిగూడెం సంఘస్తులు ఏసుప్రభును ఆనాడు కల్వరి కొండకు సిల్వ వేయించుకుంటూ తీసుకెళ్లిన విధంగా మీరు సిల్వ శ్రమలను గుర్తుంచుకుంటూ ఏసుప్రభుని వేషధారణలో రోడ్డు వెంట నడుచుకుంటూ కైకొండాయిగూడెం స్టేజి నుండి సిఎస్ఐ చర్చి వద్దనుండి బల్లేపల్లి ఆరోగ్య మాత చర్చి వరకు క్రమ పద్ధతిలో వచ్చినారు. పసలపూడి రమేష్ , కొమరవల్లి జోసెఫ్, జి.చిరంజీవి, జి .బాలేశౌర్య, జి .కృష్ణారావు, లేలేశ్వర్రావు , సురేష్ మరియు విచారణ పరిధిలోనే బల్లపల్లి , పాండురంగాపురం, ఖనాపురం , కైకొండాయిగూడెం సంఘస్తులు పాల్గొన్నారు.

# జ్యోతిష్మతి ఇంజనీరింగ్ కాలేజి యాజమాన్యం నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

**- కళాశాల యజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోని, గుర్తిపు రద్దు చేయాలనీ డిమాండ్**

**- టిజిపిఏ రాష్ట్ర అధ్యక్షులు అంబాల ప్రభాకర్ (ప్రభు)**

**కరీంనగర్, మార్చి 29 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని జ్యోతిష్మతి కళాశాలలో డిప్లామా మొదటి సంవత్సరం క్యాంపు హాస్టల్లో ఉంటు చదువుకుంటున్న జయశంకర్ భూపాలపల్లి జిల్లా, కాటారం మండలం, దామరకుంట గ్రామానికి చెందిన ఎనగంటి రజిత శ్రీనివాస్ ల మొదటి కుమారుడు అభిలాష్ , తను ఈ నెల 01న బయటకు వెళ్ళినాడని తన తండ్రి ఫోన్ చేస్తే కళాశాలలో లేడని యాజమాన్యం తెలుపడంతో తండ్రి శ్రీనివాస్ కళాశాల యాజమాన్యంతో మాట్లాడి తన కుమారుని ఆచూకి కోసం తిమ్మాపూర్ పోలీస్ స్టేషన్లో 02 న పిర్యాదు చేసినప్పటికి కనీసం దర్యాప్తు చేయకపోవడం, ఒక పత్రికా ప్రకటన చేయక పోవడం




పలు అనుమానాలు కలుగుతున్నాయన్నారు.ఉమ్మడి కరీంనగర్ జిల్లా తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా టిజిపిఏ రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ... సుమారు 25 రోజులు యాజమాన్యం నిర్లక్ష్యం చేయడం వలన విద్యార్థి ఈ నెల 27 న తిమ్మపూర్ గ్రామంలోని చైతన్య కాలేజి వెనుకాల వున్న వ్యవసాయ బావిలో తల లేని మొండెం దొరకడం అభిలాష్‌గా గుర్తించడం వెనుకాల యాజమాన్యం నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందన్నారు.కళాశాల యాజమాన్యంతో పాటు మరణానికి కారకులైన వారిని గుర్తించి చట్ట పరమైన కఠిన చర్యలు తీసుకోవాలని టిజిపిఏ రాష్ట్ర అధ్యక్షులు ప్రభు డిమాండ్ చేశారు.మృతుడు అభిలాష్ కుటుంబానికి కళాశాల యాజమాన్యం 50 లక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో తెలంగాణ పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణలో ఉన్నటువంటి తల్లిదండ్రులు అందరిని ఏకం చేసి కళాశాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. అభిలాష్ తల్లిదండ్రులకు ముఖ్యమంత్రి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి బరోసా కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో టి జి పి ఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాష్ట్ర నిజ నిర్ధారణ కమిటి కన్వీనర్ దార మధు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జీ సంగుపట్ల మల్లేష్, టి జి పి ఏ నాయకులు కొమురయ్య, పేరెంట్స్ జిల్లెల్ల శంకర్, సిరిసిల్ల అంజయ్య, అనిల్ లు పాల్గొన్నారు.

# డాక్టర్ జూగుంట్ల శ్రీనివాస రావుకు ఘన సన్మానం

**ఖమ్మం, మార్చి 29 (పీసీడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** గౌరవ డాక్టరేట్ అవార్డ్ గ్రహీత శ్రీ జూగుంట్ల.శ్రీనివాస రావుకి శ్రీ జయవిలాసిని డెవల్పర్స్అండ్ నిర్మాణ సంస్థ ప్ర.లిమిటెడ్ ఖమ్మం వారిచే ఘన సన్మానం జరిగింది. ఈ సందర్భంగా జాబిల్లి హోమ్స్ సీఎండీ డాక్టర్ వై సైదులు మాట్లాడుతూ శ్రీనివాసరావు కి గౌరవ డాక్టరేట్ అవార్డ్ , తెలంగాణ ప్రభుత్వం చే దళిత రత్న, జాతీయ అంబెడ్కర్ సేవారత్న అవార్డులు రావటం వారి సేవాకార్యక్రమాలకు నిదర్శనమని అన్నారు . అనంతరం సంస్థ లోని అందరూ శ్రీనివాస రావు మానవతా వాది, డా బాబాసాహెబ్ ఆశయాలను సాధించటానికి నిత్యం ఆలోచించటం గొప్ప మనసుకు గుర్తు అని కొనియాడారు . ఈ సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిధిగా సిఎండి.డా" కుంచపు.రాంబాబు పాల్గొని అభినందనలు తెలిపారు. డా"జూగుంట్ల.శ్రీనివాస రావు డా.బాబాసాహెబ్ భావజాల ప్రచారకులుగా పనిచేస్తూ , పేద విద్యార్థుల పై చదువులకై ఆర్థిక సహాయం చేయటం , పేద రోగుల , అనాథల దీనస్థితి చూసి ఆదుకోవడం శ్రీనివాసరావు ప్రత్యేకత అని మానవ హక్కుల పరిరక్షణ సంస్థ జిల్లా చైర్మన్ చిలకబత్తిని.కనకయ్య అన్నారు . డా.శ్రీనివాసరావు సతీమణి శ్రీమతి జూగుంట్ల.రమాదేవి మాట్లాడుతూ నా భర్త శ్రీనివాస్ సమాజ హితం కొరకే పనిచేస్తారని



, ప్రజల కష్టాలను తన కష్టాలుగా అర్థం చేసుకుని స్పందిస్తారని , అదే నాకు ఇష్టం అని అందుకే వారిని అనుసరిస్తానని , గొప్ప మానవతావాది నా భర్త అని అందుకు నాకెంతో గర్వంగా ఉందని అన్నారు. శ్రీ జయవిలాసిని దేవలపర్స్ మరియు నిర్మాణ సంస్థ ప్ర.లిమిటెడ్ డైరెక్టర్స్ అందరూ పాల్గొని తమ తమ అనుబంధాలనూ గుర్తు చేసుకొని హృద్యపూర్వక అభినందనలు తెలియజేశారు . డా.జూగుంట్ల.శ్రీనివాస రావు స్పందిస్తూ తన తోటి మిత్రులు అందరికి ధన్యవాదాలు తెలుపుతూ తన జీవితము అనేక శ్రమలతో మిలితమైందని , శ్రమిస్తే విజయాల బాట కనిపిస్తుందని, మనం వచ్చిన నాటి పరిస్థితులే నా జీవితానికి చుక్కాని అని, అందరూ బాగుండాల అనే వ్యక్తి ఆదర్శంగా నిలుస్తాడని, నా తల్లిదండ్రులు, నా సతీమణి రమాదేవి నాకు బలం అని చెప్పుకున్నారు. ఘనమైన సత్కారం చేసిన డైరెక్టర్స్ కు మరియు ఎం.డి.కుంచపు.రాంబాబు కు ధన్యవాదాలు జై భీములు చెప్పారు . భారత తపాలా శాఖలో ఉద్యోగిగా పనిచేస్తూ తపాల జీవిత బీమాలో జిల్లా మరియు రాష్ట్ర స్థాయిలో (ప్రథమ) ముందు వరుసలో ఉండి దేశస్థాయిలో 2013-14 లో 10 కోట్ల వ్యాపారం చేసి గౌరవ పోస్టర్ డిపార్ట్మెంట్ డైరెక్టర్ జనరల్ చేతుల మీదుగా టాప్ 2 అవార్డ్ అందుకున్నారు. పోస్టల్ డిపార్ట్మెంట్ రాష్ట్ర అధ్యక్షులుగా గత 15 సంవత్సరాలుగా అనేక అవార్డులు పొందారు . ఆల్ ఇండియా తపాలా శాఖలో ఎస్సీ ఎస్టీ ఆర్గనేషన్లో రాష్ట్ర , జిల్లా కార్యదర్శిగా మరియు రాష్ట్ర అధ్యక్షులుగా ఆల్ ఇండియా ప్రచార కార్యదర్శిగా ఉద్యోగుల సంక్షేమం కొరకు నిరంతరం పాటుపడుతున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డైరెక్టర్ అంబాల వెంకటేశ్వర్లు మరియు డైరెక్టర్లు రామకృష్ణ రెడ్డి , రామారావు , జె సునీల్ , విజేందర్, శ్రీకాంత్ , రవికుమార్ , మార్కెటింగ్ మిత్రురాలు , ఏపూరి ప్రేమ కుమార్ , మొల ప్రేమ కుమార్ , వీరబాబు , సురేష్ , శిల్ప , ఉమా , ఝాన్సి , శ్రీ విద్య , ఇంకా తదితర సిబ్బంది , డా.జమ్మి. వీరబాబు , ఉయ్ ఆర్ ఫర్ యూ సంస్థ ఫౌండర్ చిలకబత్తిని శ్రీకాంత్ పాల్గొన్నారు.

# వినోబా నవోదయ కాలనీ ప్రజలపై పోలీసులు ప్రభుత్వ రెవెన్యూ అధికారులు చేసిన పాశవిక దౌర్జన్యాలు , బలవంతంగా ఇండ్లలో సోదాలను తీవ్రంగా ఖండించిన (ఓపిడిఆర్) ఖమ్మం జిల్లా శాఖ

**ఖమ్మం, మార్చి 29(పిసీడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** ఖమ్మం పట్టణ శివారులోని వెలుగుమట్ల గ్రామం వినోబా నవోదయ కాలనీ లో జరిగిన సమావేశంలో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (ఓ.పి.డి.అర్) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ దండా లింగయ్య మాట్లాడుతూ పేదప్రజల నివాసాలపై పోలీసులు ప్రభుత్వ రెవెన్యూ అధికారులు ది:25న పాశవిక దౌర్జన్యాలకు , బలవంతంగా ఇండ్లలో సోదాలు చేయడంలాంటి చర్యలకు పాల్పడ్డారు . పోలీసులు జరిపిన ఈ పాశవిక దమనకాండలో పేద కుటుంబాల ఆత్మగౌరవాన్ని, అనైతికంగా అనుసరించిన విధానం పోలీసుల ప్రవర్తనకు అద్దం పడుతుందని , ఇది ముమ్మాటికీ విచక్షణా రహితంగా కుట్రపూరితమైన చర్యలుగా ప్రజాస్వామ్యహక్కుల పరిరక్షణసంస్థ (ఓపిడిఆర్) ఖమ్మం జిల్లా శాఖ పోలీసుల యొక్క దమనకాండను తీవ్రంగా నిరసిస్తున్నదని అన్నారు . ఖమ్మం పట్టణ శివారులోని వెలుగుమట్లలో సుమారు 62 ఎకరాల 7గుంటల భూదానభూమి వుంది . ఈ భూములపై గత 10 సంవత్సరాలుగా పేదలు హక్కులు సంపాదించుకుని ఇండ్లు నిర్మించుకోని వాటికి ఇంటి నెంబర్లు మరియు కరెంట్ మీటర్లు ఇవ్వాలని , ఇచ్చిన ఇంటి నెంబర్లను నిలుపుదల నుండి తొలగించాలి . ఇంకా ఇతర సదుపాయాల కొరకు ప్రజలు పోరాటం చేస్తూనే ఉన్నారు . ఈ క్రమంలో ప్రభుత్వ అధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చుకున్నా , ధర్నాలు చేసినా , చివరకు హైకోర్టు వారి నుండి మంచినీరు , కరెంట్ ఇవ్వమని ఉత్తర్వులను అమలు చేయాల్సింది పక్కనపెట్టి , పేదప్రజలకు న్యాయమైన ఈ సమస్యను పరిష్కరించటంలో స్థానిక కలెక్టర్ , రెవెన్యూ , కరెంట్ , మున్సిపాలిటీ అధికారులు పూర్తిగా విఫలమైనారు. పేద ప్రజలకు




అరు గ్యారంటీలు అమలు చేసి ఇస్తామని అనునిత్యం ప్రచారం చేసుకుంటుంది. వినోబా నవోదయ కాలనీ ప్రజలకు వచ్చిన హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయని స్థానిక ప్రభుత్వం అధికారులు చివరికి ప్రజలే స్వయంగా హక్కులు సంపాదించుకుని ఇల్లు వేసుకొని నివాసం ఉంటుండగా ది:25-03-2024న సోమవారం రోజున ఒక నిరాధారమైన పిర్యాదును ఆధారం చేసుకొని నిర్దాక్షిణ్యంగా ఇళ్లలో సోదాలు చేయడం ప్రజలపై కేసులు పెట్టారు . ఇలాంటి క్రూరమైన దౌర్జన్యాలు చేసి పేదలను అక్రమంగా అరెస్టులు చేయడంలాంటి పాశవికవిధానాలకు పోలిసు వ్యవస్థ పాల్పడింది. ఇదంతా అధికారపార్టీ అనుచరుల కనుసన్నలలో జరిగుతుంది. పాలకపార్టీ అనుచరులకు ఈ భూముల విషయంలో ప్రయోజనం కల్గించే ఉద్దేశ్యంతో ప్రభుత్వం అధికారులు బరితెగించి పోలీసులతో కలిసి పేదలపై ఈ దౌర్జన్యకాండకు పాల్పడటం హేయమైన చర్యలని దీనిని ఓపిడిఆర్ తీవ్రంగా ఖండిస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలని ఓపిడిఆర్ జిల్లా శాఖ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది . వినోబా నవోదయ కాలనీ ప్రజలపై ఆర్థికపరమైన నిరాధార వ్యాఖ్యలు చేయడం తప్పుడు ప్రచారమే అని తెలుసుకోవాలి . ప్రజలు ఎంతో కష్టపడి భూదాన బోర్డ్ వారి నుండి ప్రొసీడింగ్స్ ఆధారాలతో కట్టుకున్న ఇండ్లు , ఇంకా ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సిన లోతైన గుంతలు ఉన్న క్వారీలలో అక్కడే ఉన్న ఎత్తైన మట్టి గడ్డలను తవ్వి క్వారీలలో నింపుతూ ఇళ్లు , రోడ్లు నిర్మాణం చేసుకుంటున్న పనులను చూసి , మట్టి అక్రమ తవ్వకాలు అమ్మకం జరుగుతుంది అని భావించి కాలనీ పేదలపై పోలీసులు జరిపిన పాశవిక దమకాండను ఓపిడిఆర్ తీవ్రంగా ఖండిస్తున్నది . పోలీసు అధికారులు కోర్టు ఉత్తర్వులు చదివి అవగాహన రావాలని తెలుపుతున్నాము.., ప్రభుత్వం వెంటనే ఈ భూములపై హక్కులు పొందిన పేదలందరికీ ఇండ్లస్థలాలకు ఇంటి నెంబర్లు ఇవ్వాలని, మా భూమికి హద్దులు తేల్చి, న్యాయ బద్ధంగా నివాసముంటున్న వినోబా నవోదయ కాలనీ ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు ఒకవైపు నుండి వచ్చిన పిర్యాదును ఆధారం చేసుకొని దౌర్జన్యంగా, అక్రమ అరెస్టులను చేయడం వెంటనే ఆపివేయాలని ఓపిడిఆర్ ఖమ్మం జిల్లా శాఖ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (ఓపిడిఆర్) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ దండా లింగయ్య, ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బాణాల లక్ష్మణాచారి, సహాయ కార్యదర్శి కామ్రేడ్ చిప్పలపల్లి వీరన్న, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కం శ్రీను, సహాయ కార్యదర్శి కామ్రేడ్ తాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని మాట్లాడారు.

# మూగ జీవాల అరణ్య రోదన ?

**తొర్రూర్, మార్చి 29(పీసీడబ్ల్యూ న్యూస్):** సూర్య ప్రతాపానికి తట్టుకోలేక కొన్ని మూగజీవులు పొదల చాటున చెత్త కుప్పల కింద తల దాచుకుంటాయి.రాత్రి వేళలో ఆహారం కొరకు చిత్తడిగా ఉన్న ప్రాంతానికి వచ్చి మాట వేసి ఉంటాయి. కొన్ని జీవాలు వాటి సంతానం పెంచుకునేందుకు భూమి అడుగు భాగంలో రంధ్రాలను ఏర్పాటు చేసుకొని వాటి జీవనాన్ని సాగిస్తూ ఉంటాయి. ఇలాంటి మగ జీవాలు అన్నిటికి ప్రాణ సంఘటన ఏర్పడుతుంది.ఈ అగ్ని ద్వారా ఇదే కాకుండా ఎక్కడున్నా నరికిన అనంతరం వారి పంట పొలాల్లో చెత్త చెదారం లేకుండా చూసుకునేందుకు రాత్రి సమయంలోనే అగ్నిరాగింప చేసి వదిలేస్తారు. ఇది ఒకే గ్రామంలో కాదు ఎక్కడ ఈ చెట్లను నరికిన రైతులందరూ చేసే పని ఇదే. ఈ సమయంలో గాలి దుమారం లేస్తే దగ్గరలో ఉన్న మక్క చేనులు, ఇతర పంటలకు హానికలిగి నోటికి అందవలసిన పంటలను కోల్పోయే అవకాశాలు లేకపోలేదని అటుగా వెళుతున్న వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పర్యావరణం ఎంతో దెబ్బతిని వేడి తాపానికి తట్టుకోలేక అల్లాడిపోతున్నారు. ఇప్పటికైనా రైతులు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టకుండా చూసుకోవాలని అంటున్నారు. తొర్రూరు మండల కేంద్రం నుండి అన్నారం వెళ్లే రహదారిలో ఈ కల్లు కు మూలమలుపు ప్రాంతంలో ఈ కారు చిచ్చు చెలరేగుతున్న దృశ్యాలను వారి చెరవానిలో బంధించి పి సి డబ్ల్యూ న్యూస్ అందించారు.



PCW తెలుగు దినపత్రిక

శనివారం 30 మార్చి 2024

# ఏప్రిల్ 1న జరగబోయే ఎమ్మార్పీఎస్ పరకాల నియోజకవర్గం సదస్సును విజయవంతం చేయండి

**- పరకాల నియోజకవర్గం ఇంచార్జ్ మందరాజు మాదిగ**

**పరకాల, మార్చి 29 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఏప్రిల్ 1న పరకాలలో జరగనున్న నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి ఎంఎస్ఎఫ్ అనుబంధ సంఘాల సదస్సుకు ముఖ్యఅతిథిలు మందకృష్ణ మాదిగ విచ్చేయనున్నారు. సభను విజయవంతం చేయాలని ఈరోజు పరకాల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి శంకర్ మాదిగ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా మంద రాజు మాదిగ పరకాల నియోజకవర్గ ఇన్చార్జ్ పాల్గొని ఎమ్మార్పీఎస్ ఎంఎస్ఎఫ్ ఎంఎస్పి అనుబంధ సంఘాల నాయకుల తో మాట్లాడుతూ జాతి భవిష్యత్తు ఎస్సి ఏబిసిడి వర్గీకరణ పై ఆధారపడి ఉందని మాదిగ



మాదిగ ఉపకులాలకు సమన్యాయం జరగాలంటే వర్గీకరణ లక్ష్యం

గా 29 సంవత్సరాలుగా ఉద్యమాలు చేస్తు అనగారిన వర్గాల పక్షాన మాట్లాడుతున్న ఏకైక గొంతుక మందకృష్ణ మాదిగ అన్న నని కార్యకర్తలు కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఒకటిన జరిగే పరకాల నియోజకవర్గం సభను అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చాతాళ్ళ రమేష్ మాదిగ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఇనుముల పూర్ణయ్య మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు, దామెర రవి మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు,బొచ్చు ప్రశాంత్ మాదిగ ఎమ్మెస్ ఎఫ్ పట్టణ అధ్యక్షులు,బొట్ల యాకూబ్ మాదిగ,కోగిల రమేష్ మాదిగ, రాజేష్ మాదిగలు పాల్గొన్నారు.

# సోదర భావానికి ప్రతీక రంజాన్

**- ఘనంగా ఇఫ్తార్ విందు వేడుకలు**

**హనుమకొండ ప్రతినిధి, మార్చి 29 (పిసిడబ్ల్యూ న్యూస్):** కులమతాలకు అతీతంగా, శోదా భావానికి ప్రతికంగా క్యాంపుకుని పండగ రంజాన్ అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాగిని రాజేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, హన్మకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అద్యక్షులు నాయిని రాజేందర్ రెడ్డి ముస్లిం సోదరులకు హన్మకొండ జాక్రియ ఫంక్షన్ హాల్ లో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసారు. ఈ ఇఫ్తార్ విందులో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ కుస్రు పాషా , రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్య సభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ..ముస్లింలకు పరమ పవిత్రమైనది రంజాన్ మాసమని, కులమతాలకు అతీతంగా ప్రతీ ఒక్కరు సోదరభావంతో మెలగాలన్నారు. ముందస్తుగా అందరికి అడ్వాన్సు రంజాన్ శుభాకాంక్షలు తెలియ చేసారు. ఈ సందర్భంగా రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రూ పాషా మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ముస్లిం సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఓ పండుగ వాతావరణంలా జరుపుకునే అత్యంత పవిత్రమాసం మాహే రంజాన్. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు ఎంతో నిష్ఠతో ఉపవాసాలు ఉంటారని, అల్లా అందరిని చల్లగా చూడాలని, మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని అన్నారు. ఉపవాస దీక్ష (రోజా), నమాజ్, జకాత్‌లు ఆచరించే అవకాశం రంజాన్ మాసంలోనే ప్రాప్తిస్తున్నందున ముస్లింలు ఈ రంజాన్ మాసాన్ని అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారని అన్నారు. ముస్లింలు సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు మంచినీళ్లు కూడా తాగకుండా కఠినమైన ఉపవాసం చేస్తారని అన్నారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ..ఇప్పటి వరకు 18 సార్లు ఇఫ్తార్ పార్టీని ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి సంవత్సరం సొంతంగా ఇఫ్తార్ పార్టీ ని ఏర్పాటు







చేయడం చాల సంతోషంగా ఉందని కావున పార్టీలకు అతీతంగా ముస్లింలు ఇఫ్తార్ పార్టీ లో పాల్గొంటారని అన్నారు. శుక్రవారం మీరందరు పిలవగానే ఈ ఇఫ్తార్ విందుకు హాజరైనందుకు మీ అందరికీ కృతజ్ఞతలు మరియు చాల సంతోషం. ఆ అల్లా దయతో అందరు ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో ఉండాలని మనస్పూర్తిగా ప్రార్థిస్తున్నాను. ప్రతి సంవత్సరం సొంతంగా ఇఫ్తార్ పార్టీ ని ఏర్పాటు చేయడం చాల సంతోషకరమని అన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో తన వంతుగా ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిన ట్లు తెలిపారు అడ్వాన్స్ రంజాన్ శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను. ఈ సందర్భంగా రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ మాట్లాడుతూ ..ముస్లింలకు అతి పవిత్రమైన మాసం రంజాన్. నెలవంక చూసినప్పటి నుంచి ప్రారంభమయ్యే ఈ మాసంలో ముస్లిం సోదరులు కఠోరమైన ఉపవాస దీక్షలు చేపడతారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు ఎంతో నిష్ఠతో ఉపవాసాలు ఉంటారని, అల్లా అందరిని చల్లగా చూడాలని, మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, మేయర్ రాష్ట్ర ఫైనాన్సు కమిటీ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, రాష్ట్ర గ్రంధాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్, టిపిసిసి కార్యదర్శి ఈ.వి. శ్రీనివాస్ రావు, పిసిసి సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ మొహమ్మద్ ఇస్మాయిల్ శంషి, మౌలానా ఫసిఉద్దిన్, మగ్ధూం, సీనియర్ కాంగ్రెస్ నాయకులూ బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, , కార్పొరేటర్లు జిల్లా మైనారిటీ సెల్ చైర్మన్లు మహమ్మద్ ఆయుబ్, ముజాహిద్, సమీ మహమ్మద్ మిర్జా అజీజుల్లా బేగ్, టిపిసిసి సోషల్ మీడియా కార్యదర్శి మొహమ్మద్ ముస్తాక్ నేహాల్, మొహమ్మద్ జాఫర్, నాయకుడు సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ, ఎస్ కే అమర్, ఖాజా మొయినుద్దీన్, మొహమ్మద్ నసీర్, మొహమ్మద్ అంకుష్, గుఫ్తాబ బాబా, మస్జిద్ కమిటీ సభ్యులు ముస్లిం మత పెద్దలు మస్జిద్ కమిటీ సభ్యులు కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, పోతుల శ్రీమాన్, జక్కుల రవీందర్ యాదవ్, సయ్యద్ రాజాలి, చీకటి శారద ఆనంద్, బాబ్ భాయ్, మాజీ కార్పొరేటర్లు డివిజన్ అద్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# ఆకుల రాలే కాలం ఇది

- పనికరాని ఆకులు చెత్తలో పడుతున్నాయి
- కష్టకాలంలో ఉంటే ద్రోహం చేసి వెళుతున్నారు
- పార్టీ వీడిన వారు కాళ్లు మొక్కినా వెనక్కి తీసుకోం
- పార్టీని వీడుతున్న వారిపై మండిపడ్డ హరీష్ రావు

**సిద్దిపేట,మార్చి 29 (పిసిడబ్ల్యూ న్యూస్):** కష్టకాలంలోఉన్న సమయంలో బీఆర్ఎస్ పార్టీని వీడుతున్న నాయకులపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పవర్ బ్రోకర్లు, అవకాశవాదులు పార్టీని విడిచి వెళ్లిపోతున్నారని, అలాంటి వారంతా పనికిరాని ఆకుల మాదిరిగా పార్టీని వీడుతున్నారని హరీశ్‌రావు విమర్శించారు. దుబ్బాకలో ఏర్పాటు చేసిన మెదక్ పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశంలో హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. ఇవాళ మన పార్టీ నుంచి కొంతమంది నాయకులు బయటకు పోతున్నారు.. కార్యకర్తలు ఎవరూ వెళ్లడం లేదు. ఎవరైతే మధ్యలో మన పార్టీలోకి వచ్చారో.. పవర్ బ్రోకర్లు, అవకాశవాదులు పార్టీని విడిచి వెళ్లిపోతున్నారు. ఇప్పుడు ఎవడైతే పార్టీ నుంచి పోయారో.. రేపు కాళ్లు మొక్కినా పార్టీలోకి రానిచ్చేది లేదని పార్టీ నిర్ణయం తీసుకున్నది. ఎట్టి పరిస్థితుల్లో వారిని పార్టీలోకి రానిచ్చే పరిస్థితి లేదు. కష్టకాలంలో పార్టీకి ద్రోహం చేస్తే కన్నతల్లికి ద్రోహం చేసినట్టే. ఇది అన్యాయం కాదా..? ఏం తక్కువ చేసింది పార్టీ వారికి.. అన్ని అవకాశాలు ఇచ్చింది. పార్టీకి అండగా నిలబడ్డ నాయకులను, కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుంటాం అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఇది ఆకులు రాలేకాలం.. ఇప్పుడు అట్లనే మన పార్టీలో నుంచి కొన్ని పనికిరాని ఆకులు చెత్తకుప్పలో కలిసి పోతున్నాయి. ఆకులు పోయాక మళ్లీ కొత్త చిగురు వచ్చి ఆ చెట్టు వికసిస్తుంది. కొన్ని ఆకులు పోయినట్టు కొంతమంది నాయకులు పోవచ్చు. తెలంగాణ రాష్ట్రం ఉన్నంతకాలం బీఆర్ఎస్ పార్టీ ఉంటది. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజల కోసం, ఈ ప్రాంతం కోసం పని చేసేపార్టీ.



అసలు రేవంత్ రెడ్డి జై తెలంగాణ అన్నాడా..? ఉద్యమంలో జై తెలంగాణ అనలేదు. ఇప్పుడు కూడా అనడం లేదు. కనీసం ఏనాడైనా అమరవీరుల స్థూపం వద్ద రెండు పూలు పెట్టలేదు. తెలంగాణ మీద ప్రేమ లేదు ఆయనకు. తెలంగాణ కోసం పోరాడింది మనం. రాజకీయంగా లబ్ది పొందేందుకు వారు దుష్ప్రచారం చేస్తున్నారు. దుబ్బాక బీఆర్ఎస్ అడ్డా.. మెదక్ ఎంపీ స్థానంలో ఇప్పుడు కూడా బీఆర్ఎస్ గెలిచి తీరాల్సిందే. తెలంగాణ ఉద్యమం జరిగే సమయంలో పట్టున పది మంది లేకున్నా.. కేసీఆర్ తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభించి.. రానే రాదు కానే కాదు అన్న తెలంగాణ తెచ్చి పెట్టిండు. తెలంగాణ వస్తదంటే ఆ రోజు ఎవరూ నమ్మలేదు.. కానీ కేసీఆర్ తెలంగాణను తెచ్చిపెట్టిండు అని హరీశ్‌రావు గుర్తు చేశారు.

## కార్మికుల సేఫ్టీ కోసం తగిన జాగ్రత్తలు తీసుకుంటాం

**- మ్యాన్ రైడింగ్ రోపువే ప్రారంభించిన మేనేజర్**



**తొర్రూర్, మార్చి 29(పీసీడబ్ల్యూ న్యూస్):** మంచిర్యాల జిల్లా కాజీపేట మండలంలోని రెండవ గనిలో కొబ్బరికాయ కొట్టి రోప్ వే ను ప్రారంభించిన గని మేనేజర్ లక్ష్మీనారాయణ. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ వీలైనంత త్వరగా మాన్ రైడింగ్ ప్రారంభించాలని కార్మికుల సేఫ్టీ ని దృష్టిలో పెట్టుకొని తగిన జాగ్రత్తలు తీసుకుంటామని అన్నారు. హాజర్ శాతం పెరిగే అవకాశాలు ఉన్నాయని మ్యాన్ రైడింగ్ కావలసిన చైరులు రావడం జరిగిందని పేర్కొన్నారు. ఇక్కడ కూడా ఇలాంటి ఇబ్బంది లేకుండా ఇంజనీర్ పర్యవేక్షణలో మ్యాన్ రైడింగుపనులు త్వరితగతిన పూర్తి చేస్తామని అన్నారు. ఏప్రిల్ మొదటి వారంలో కార్మికులకు తీపి కబురు చెప్పటం కార్మికులంతా సర్వత్రా హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సేఫ్టీ ఆఫీసర్ సంతోష్ రావు, ఇంజనీరింగ్ రఘు, కృష్ణ ప్రసాద్, ఐఎన్ టియుసి సీనియర్ నాయకులు కారకూరు తిరుపతి, ఏఐటీయూసీ ఫిట్ సెక్రటరీ గోళ్ళ శ్రీనివాస్ కార్మికులు పాల్గొన్నారు.

## సైకిల్ యాత్ర ప్రారంభించిన ఎమ్మెల్యే





**తొర్రూర్, మార్చి 29(పీసీడబ్ల్యూ న్యూస్):** పాలకుర్తి నియోజకవర్గం నుండి శాసనసభ్యురాలుగా యశస్విని రెడ్డి ఘన విజయం సాధిస్తే తిరుపతి వరకు సైకిల్ పై యాత్ర చేస్తారని ఒక అభిమాని దేవునికి మొక్కుకున్నారని అన్నారు. అభిమాని అనుకున్న ప్రకారమే భారీ మెజార్టీతో శాసన సభ్యురాలుగా యశస్విని రెడ్డి విజయం సాధించగా తన మొక్కులు చెల్లించుకునేందుకు శుక్రవారం సైకిల్ పై యాత్రను కొనసాగించాలని అనుకున్నారు. తన అభిమాని సైకిల్ యాత్రకు జెండా ఊపి ప్రారంభించారు శాసనసభ్యురాలు. నా విజయం కొరకు అభిమానిగా సైకిల్ పై యాత్ర చేస్తారని అనడం వారిని జీవితాంతం గుర్తుంచుకుంటానని పేర్కొన్నారు. శాసనసభ్యురాలు ప్రసంగిస్తూ తీగారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ వీరాభిమాని బీసీ సెల్ మండల అధ్యక్షుడు బై కాని చేపట్టిన తిరుపతి యాత్ర మంచి వేసవి కాలంలో ప్రారంభించారని క్షేమంగా వెళ్లి లాభంగా తిరిగి రావాలని ఆమె కోరుకున్నారు. గ్రామంలోని వెంకటేశ్వర ఆలయం వద్ద ఈ యాత్రకు ప్రారంభించారు .వేసవిలో తగిన జాగ్రత్తలు తీసుకుంటూ వడదెబ్బ తగలకుండా మధ్య మధ్యలో విశ్రాంతి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు గ్రామ మాజీ సర్పంచ్ పోవు రాజేశ్వరి శ్రీనివాస్ మాజీ ఉపసర్పంచ్ వెంకటేష్, మొగుళ్ళ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌తో భేటీ అయిన బిఆర్ఎస్ మాజీ ఎంఎల్ఎ...

**హైదరాబాద్,మార్చి 29(పీసీడబ్ల్యూ న్యూస్):** పార్లమెంట్ ఎన్నికల వేళ వలసలు బిఆర్ఎస్ పార్టీని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ముఖ్యనేతలు, సిట్టింగ్ ఎంపిలు, ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. ఇక, తాజాగా శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ కీలక నేత మదన్ రెడ్డి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ముఖ్యమంత్రితో మదన్ రెడ్డి సమావేశం అయిన సమయంలో మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి నీలం మధు ముదిరాజ్, నర్సాపూర్ కాంగ్రెస్ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డితో పాటు నర్సాపూర్ కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఉన్నారు.

